# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక :261 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | సోమవారం 28 సెప్టెంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :261 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | MON 28 SEPTEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# పల్లె పండుగ 3.0

## ఈ నెల 29న రామాపురంలో చంద్రబాబు, పవన్ పర్యటన

- ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుద్ధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది.

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఆ రెండు పార్టీలతో నష్టమే..

## ఈ నెల 30న ఆధారాలతో వస్తా: విజయసాయిరెడ్డి

- ఈ నెల 30న విశాఖలో విజయసాయి రెడ్డి కీలక ప్రెస్‌మీట్
- రెండు కుటుంబ పార్టీల వల్ల రాష్ట్రానికి నష్టమంటూ ఆరోపణ
- ఆధారాలతో సహా వివరాలు బయటపెడతానని ప్రకటన
- ఉత్తరాంధ్ర సమస్యలు, మత మార్పిడులపైనా మాట్లాడనున్నట్లు వెల్లడి
- ప్రజల ముందు మరో 5 కొత్త ప్రతిపాదనలు ఉంచనున్న విజయసాయి

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి మరో కీలక ప్రెస్‌మీట్‌కు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ రాజకీయ పార్టీల వల్ల ప్రయోజనం లేకపోగా, తీవ్ర నష్టం జరుగుతోందని, ఇందుకు సంబంధించిన ఆధారాలను బయటపెడతానని ఆయన ప్రకటించారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు, విశాఖపట్నంలోని దసపల్లా హోటల్ వేదికగా ఈ వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించనున్నట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయం, ప్రస్తుత రాజకీయాల్లోని తెరవెనుక పొత్తులు, గిరిజనులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మత మార్పిడుల వంటి విషయాలపై మాట్లాడతానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజా ప్రయోజనాల

- మిగతా 2లో



# ఒకటి కాదు రెండు సార్లు మొజ్తబాపై దాడులు..

## శిథిలాల నుంచి ఆయన్ను వెలికితీశాం..

పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన ప్రారంభంలోనే మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు

- మిగతా 2లో




# దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలు..

## ప్రారంభించిన అమిత్ షా

పెన్ పవర్ డెస్క్: దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ సమూలంగా మార్చారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్‌లో దేశంలోనే మొట్టమొదటి ఎల్ఎన్‌జీ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిం చారు. అనంతరం నిర్వహించిన

- మిగతా 2లో




# డిజిటల్ అరెస్టులపై సీబీఐ ఉక్కుపాదం..

## 10 రాష్ట్రాల్లో సోదాలు..

## ఇద్దరు అరెస్ట్

పెన్ పవర్ డెస్క్: దేశంలో తీవ్ర కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉక్కుపాదం మోపుతోంది. ఆపరేషన్ చక్ర–VI లో భాగంగా

- మిగతా 2లో

# సహనం కోల్పోయిన మంత్రి..

## ప్రతిపక్ష ఎమ్మెల్యే సహాయకుడిపై దాడి

పెన్ పవర్ డెస్క్: ఢిల్లీ ప్రజా పనుల శాఖ మంత్రి పర్వేశ్ వర్మ సహనం కోల్పోయారు. ప్రతిపక్ష ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఎదుటే.. ఆయన వ్యక్తిగత సహాయకుడి చెంప చెళ్లుమనిపించారు. ఈ ఘటన పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్‌లో చోటు చేసుకుంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిలక్‌నగర్‌లో ఇటీవల రోడ్డు నిర్మించారు. అయితే, దీని నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రజా పనుల శాఖ మంత్రిగా ఉన్న పర్వేశ్ వర్మ రోడ్డు తనిఖీ చేపట్టేందుకు వెళ్లారు.

- మిగతా 2లో



# కూటమిలో సమన్వయమే స్థానిక ఎన్నికల్లో విజయానికి కీలకం



- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా విశాఖలో ఎన్డీఏ సమన్వయ సమావేశం

- మిగతా 2లో

- కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉండాలన్న పల్లా
- గ్రామస్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేయాలని నేతలకు దిశానిర్దేశం
- అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలని సమావేశంలో కీలక నిర్ణయం
- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు

# విమర్శల ఎఫెక్ట్.. వెనక్కి తగ్గిన విజయ్..

## లా అండ్ ఆర్డర్ శాఖకు ఆర్టీఐ మినహాయింపు ఉత్తర్వు రద్దు

పెన్ పవర్ డెస్క్: ప్రభుత్వం పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖను సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వును తమిళనాడు ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రతిపక్షాలు, సీపీఎం సహా పలు వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఇవాళ(సెప్టెంబర్ 27) ఈ నిర్ణయం తీసుకుంది.

- మిగతా 2లో






# ఏపీ వ్యాప్తంగా హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు..

## 25 మూసివేత

- రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లపై ఆహార భద్రతాధికారుల దాడులు
- నిబంధనల ఉల్లంఘన కారణంగా 25 హోటళ్ల మూసివేత
- మొత్తం 66 సంస్థల్లో తనిఖీలు, 30 చోట్ల కేసులు నమోదు
- మరో 45 హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ
- లోపాలు సరిదిద్దుకోవాలని యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రతా విభాగం అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తీవ్రమైన

- మిగతా 2లో

# గుంటూరులో వ్యభిచార ముఠా గుట్టురట్టు..

## నిర్వాహకురాలితో సహా ఐదుగురి అరెస్ట్

- గుంటూరులో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి
- నిర్వాహకురాలితో పాటు మొత్తం ఐదుగురు అరెస్ట్
- వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపి విటులను ఆకర్షిస్తున్నట్లు గుర్తింపు

- మిగతా 2లో

- నిందితుల నుంచి 5 సెల్ ఫోన్లు స్వాధీనం
- అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



## ఎడిటర్ వ్యూ

# వాయుగుండం పోయె.. సూరీడు మంటల మొదలయ్యె

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నేడు అక్కడక్కడ వానలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయుగుండం బలహీనపడటంతో కొంత వరకూ వానలుతగ్గే అవకాశముంది. అదే సమయంలో ఉష్ణోగ్రతలు కూడా మళ్లీ పెరిగే అవకాశముంది. అలాగే ఉక్కపోత కూడా మొదలవుతుందని అంటున్నారు. రాబోయే రెండు రోజులలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం నివేదిక ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లో వాయుగుండం ప్రభావం క్రమంగా బలహీనపడుతున్నప్పటికీ, అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.అయితే ఎక్కడా భారీ వర్షాలు మాత్రం నమోదయ్యే అవకాశాలు లేవని మాత్రం చెప్పింది. అదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశముంది. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నట్లు తెలిపింది.

**వాయుగుండం బలహీనపడటంతో...**

ఆంధ్రప్రదేశ్ వాతావరణం కూడా భిన్నమైనదిగా ఉండనుంది. వాయుగుండం ప్రభావం తగ్గడంతో కొంత మేరకు వానలు తగ్గుతాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్రలో మాత్రం మోస్తరు వానలు పడతాయని చెప్పింది. ఇప్పటికే ఉత్తరాంధ్రలో నదులు, వాగులు ఉప్పొంగుతున్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి వస్తున్న వరదల కారణంగా నాగావళి వంటి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట నష్టం కూడా తీవ్రంగా జరిగింది. కోస్తాంధ్ర తీరం వైపు ఉన్న వాయుగుండం ప్రభావం క్రమంగా బలహీనపడుతోంది. అయిన ప్పటికీ ఉత్తర కోస్తా మరియు కొన్ని ప్రాంతాలలో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాయలసీమ జిల్లాల్లో మాత్రం తేలికపాటి జల్లులు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**అక్కడక్కడ వానలు...**

తెలంగాణలో నేడు అక్కడక్కడ వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బలమైన గాలులు వీస్తాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా. రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి.సెప్టెంబర్ 27 తర్వాత నుంచి రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే కొంత ఉక్కపోత మొదలయింది. పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరిగాయి. ఎల్ నినో ప్రభావంతో ఇక ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయన్న అంచనాలు వినపడుతున్నాయి.

# గుంటూరులో వ్యభిచార ముఠా గుట్టురట్టు..

గుంటూరు నగరంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఓ వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. వాట్సాప్ ద్వారా విటులను ఆకర్షిస్తూ హైటెక్ పద్ధతిలో దందా నిర్వహిస్తున్న ఇంటిపై దాడి చేసి, నిర్వాహకురాలితో సహా మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, ఎస్బీ డీఎస్పీ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ సీఐ పర్యవేక్షణలో పోలీసులు వ్యభిచార కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని భారత్‌పేట 7వ లైన్‌లో ఒక ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) సిబ్బంది, అరండల్‌పేట ఎస్ఐ అశోక్ బృందంతో కలిసి ఆదివారం మధ్యాహ్నం 12:45 గంటల సమయంలో ఆ ఇంటిపై సంయుక్తంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో వ్యవస్థీకృతంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇంట్లో ఉన్న నలుగురు మహిళలతో పాటు, ఒక విటుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గోరంట్లకు చెందిన పి. సాయి లక్ష్మి అలియాస్ అంజలి ఈ దందాకు నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. విటులను ఆకర్షించేందుకు ఆమె వాట్సాప్ ద్వారా యువతుల ఫొటోలు పంపి డీల్స్ కుదుర్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కూటమిలో సమన్వయమే స్థానిక ఎన్నికల్లో విజయానికి కీలకం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి కార్యాచరణను ముమ్మరం చేసింది. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సమన్వయం సాధించి, సమష్టిగా ముందుకు సాగేందుకు అవసరమైన వ్యూహాలపై చర్చించేందుకు విశాఖలో కీలక సమావేశం జరిగింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన నగరంలోని టీడీపీ జోనల్ కార్యాలయంలో ఈ భేటీని నిర్వహించారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కూటమి పార్టీల శ్రేణుల మధ్య సమన్వయమే విజయానికి అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు ప్రకటించినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయ కమిటీలను మరింత చురుగ్గా మార్చాలని సూచించారు. స్థానిక సమస్యలు, ప్రజావసరాలపై పూర్తి అవగాహన ఉండి, ప్రజల్లో ఆదరణ కలిగిన అత్యంత అనుకూలమైన అభ్యర్థులను గుర్తించడంపై దృష్టి సారించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయిలోని రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, అందుకు అనుగుణంగా కార్యాచరణలో మార్పులు చేసుకోవాలని నేతలకు సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం, కార్యకర్తల మధ్య నిరంతర సమాచార మార్పిడి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను చాటాలని, సమష్టి కృషితో ఘన విజయం సాధించాలని పల్లా పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా పార్లమెంట్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఏ. షరీఫ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మూడు పార్టీల ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆ రెండు పార్టీలతో నష్టమే..

- మొదటి పేజి తరువాయి

దృష్ట్యా మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆయన ఆహ్వానించారు.ఇప్పటికే విజయవాడ, అనంతపురంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ల ద్వారా 10 ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచినట్లు ఆయన గుర్తుచేశారు. తాజాగా విశాఖ సమావేశంలో మరో 5 కొత్త ప్రతిపాదనలను ముందుకు తేనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు విజయసాయి రెడ్డి తన సోషల్ మీడియా ఖాతాలో ఓ ప్రకటన విడుదల చేశారు.

# దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలు..

- మొదటి పేజి తరువాయి

సభలో ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. మరోవైపు.. గత 12 ఏళ్లలో మోదీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

“2014లో మోదీ ) అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలను కల్పించి, దానిని ఆధునికీకరించారు. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారు. హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్‌ను నిలిపారు. ముంబయి నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్‌ను నాలుగు ట్రాక్‌ల నెట్‌వర్క్‌గా మార్చుతున్నాం” అని అమిత్ షా తెలిపారు.

**ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోం.. ‘మన్ కీ బాత్’లో ప్రధాని మోదీ**

“2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి సున్నాకి తగ్గిస్తాం. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగగా.. 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగింది. 99.6 శాతం రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తయ్యింది” అని అమిత్ షా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఈ కొత్త రైలు ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), డీజిల్ రెండింటిపై నడుస్తుంది. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్‌జీతో భర్తీ చేస్తుంది. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టారు.

# ఒకటి కాదు రెండు సార్లు మొజ్తబాపై దాడులు..

- మొదటి పేజి తరువాయి

తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్‌దరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండు సార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. ‘అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో సమావేశమైన సమయంలో అమెరికా దాడులు (ఖురతీఅనివం) చేసింది. ఈ ఘటనలో మాజీ సుప్రీం నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. అనంతరం అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచుకుపడ్డారు. దీంతో అది పూర్తిగా ధ్వంసమయ్యింది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బలగాలు శిథిలాల నుంచి మొజ్తబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అందించాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయనను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదు.

ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవడానికి నియమించిన కమిటీ నేతలను కూడా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకున్నాయి. వారు తరచూ సమావేశమయ్యే ఖోమ్ సెక్రటేరియట్‌పై దాడి చేశాయి. దీంతో వారిలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మొజ్తబా (వీశీఘ్మఖష్ఘుఎవఅవఱ)ను సుప్రీం నేతగా ఎన్నుకోవడానికి రూపొందించిన నివేదికలు, సిఫార్సులు కాలి బూడిదయ్యాయి. అదే సమయంలో ఆయనను సుప్రీంగా ఎన్నుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయినప్పటికీ మొజ్తబానే దేశాన్ని ముందుకు నడిపించగలడని భావించి మా నాయకుడిగా ఎన్నుకున్నాం’ అని మొహ్సెన్ హెయ్‌దరీ ఖతార్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# డిజిటల్ అరెస్టులపై సీబీఐ ఉక్కుపాదం.. 10 రాష్ట్రాల్లో సోదాలు.. ఇద్దరు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

గుజరాత్‌కు చెందిన రూ.11.42 కోట్ల భారీ డిజిటల్ అరెస్ట్ కేసుకు సంబంధించి 10 రాష్ట్రాల్లోని 22 ప్రాంతాల్లో సీబీఐ శనివారం విస్తృత సోదాలు నిర్వహించి, ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**మూడు నెలల పాటు డిజిటల్ అరెస్ట్:**

ఈ కేసులో సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులు, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులమంటూ బాధితుడిని నమ్మించి, ఏకంగా మూడు నెలల పాటు ‘డిజిటల్ అరెస్ట్’ పేరుతో భయభ్రాంతులకు గురిచేశారు. ఆపై తమ ఆధీనంలో ఉన్న వివిధ బ్యాంక్ ఖాతాలకు రూ. 11.42 కోట్లు బదిలీ చేయించుకున్నారు. కేసు నమోదు చేసుకున్న సీబీఐ రంగంలోకి దిగింది. సోదాల అనంతరం ఈ సైబర్ ముఠాలో కీలక పాత్ర పోషించిన హిమాంశు ప్రసాద్, యూనిస్ బిశ్వాస్ అనే ఇద్దరు నిందితులను సీబీఐ అరెస్ట్ చేసింది. వీరు ‘వీ/o Hexaquest Global Pvt. Ltd’ కంపెనీ బ్యాంక్ ఖాతాను ఉపయోగించి బాధితుడి నుంచి రూ. 2.5 కోట్లు పొందినట్లు, నిధులను ఇతర ఖాతాలకు మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. సోదాల్లో

కీలక బ్యాంకింగ్ పత్రాలు, డిజిటల్ పరికరాలు, మోసపూరిత చాటింగ్‌లు, ఎపికె ఫైళ్లను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**సీబీఐ ముమ్మర చర్యలు:**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ సైబర్ నేర ముఠాలపై కఠిన చర్యలు చేపడుతోంది. ఆపరేషన్ చక్ర-ఎ× లో భాగంగా గత 30 రోజుల్లో సీబీఐ 22 రాష్ట్రాల్లో 142 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించి

17 మంది నిందితులను అరెస్ట్ చేసింది. ఈ సందర్భంగా సీబీఐ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. పోలీసులు, సీబీఐ లేదా ఇతర ప్రభుత్వ సంస్థలేవీ ఎవరినీ ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా డిజిటల్ అరెస్ట్ చేయవని, డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ కాల్స్ వస్తే వెంటనే కట్ చేసి 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సీబీఐ కోరింది.

# సహనం కోల్పోయిన మంత్రి.. ప్రతిపక్ష ఎమ్మెల్యే సహాయకుడిపై దాడి

- మొదటి పేజి తరువాయి

స్థానిక ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ కూడా ఆయనతో ఉన్నారు.మంత్రి ఎదుటే.. ఎమ్మెల్యే జర్నైల్ రోడ్డును చేత్తోనే తవ్వి ఓ పెళ్లను బయటకు తీశారు. ‘చూశారా? మంత్రి గారూ.. మీరు ఎంత నాసిరకంగా రోడ్డు వేయించారో’ అంటూ ఆయనకే చూపించారు. ‘గత 15 ఏళ్లుగా మీరు అధికారంలో ఉన్నారు కదా.. అప్పుడు మీరు చేయలేని పని మేం చేశాం సంతోషించు’ అని మంత్రి చెబుతుండగా.. ‘అయితే.. కనీసం 15 రోజులైనా పూర్తవకుండానే చెడిపోయేంత నాసిరకంగా వేస్తారా?’ అని ఎమ్మెల్యే ఎదురు ప్రశ్నించారు. ఆయన్ని సముదాయిస్తూ.. మంత్రి ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. రోడ్డు పెళ్లను చేత్తో పట్టుకొని ఎమ్మెల్యే ఆయన్ని అనుసరించారు. ఎదురుగా.. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు ఫోన్‌లో ఈ ఘటనను రికార్డు చేస్తున్నాడు. సహనం కోల్పోయిన మంత్రి ఫోన్‌ను పక్కకు నెట్టేసి.. అతడి చెంపపై కొట్టారు. అతడు కూడా మంత్రి మీదకి దూసుకెళ్లడంతో.. పోలీసు సిబ్బంది పక్కకి తీసుకెళ్లిపోయారు. అక్కడున్న ఆప్ నేతలు, కార్యకర్తలు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**అందుకే కొట్టా: మంత్రి పర్వేశ్ వర్మ**

ఈ ఘటనపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందిస్తూ.. తన చర్యను సమర్థించుకున్నారు. తిలక్‌నగర్ వెళ్లగానే.. ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ తన అనుచరులతో అక్కడికి వచ్చి రాద్ధాంతం చేశారని అన్నారు. వారిలో ఒకరు తన కుటుంబ సభ్యులను దూషించాడని.. అందుకే కోపంతో కొట్టానని చెప్పారు. తన స్థానంలో ఎవరున్నా.. అదేపని చేస్తారని సమర్థించుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# విమర్శల ఎఫెక్ట్.. వెనక్కి తగ్గిన విజయ్..

## లా అండ్ ఆర్డర్ శాఖకు ఆర్టీఐ మినహాయింపు ఉత్తర్వు రద్దు

- మొదటి పేజి తరువాయి

సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ జారీ చేసిన ఉత్తర్వులో లా అండ్ ఆర్డర్ శాఖను ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ సంస్థగా పేర్కొంటూ ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) కింద మినహాయింపు కల్పించారు. అయితే ఈ నిర్ణయంపై రాజకీయంగా తీవ్ర దుమారం రేగింది. లేటెస్ట్ గా మానవ వనరుల నిర్వహణ శాఖ మరో ఉత్తర్వు జారీ చేసి.. సెప్టెంబర్ 21న ఇచ్చిన మినహాయింపు ఉత్తర్వు రద్దయిందని స్పష్టం చేసింది. దీంతో పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖకు ఆర్టీఐ మినహాయింపు ఇక వర్తించదు.పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖ పరిధిలో సామాజిక, కుల ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, నిర్బంధ నిర్బంధాలు, కస్టడీ మరణాలు, పోలీసులపై వేధింపులు, హింస ఆరోపణలు వంటి కీలక అంశాలు ఉంటాయి.ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం ప్రభుత్వం నిర్దిష్ట ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ సంస్థలకు మినహాయింపు ఇవ్వవచ్చు. అయితే అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారానికి పరిమిత మినహాయింపులు మాత్రమే ఉంటాయి.

ఈ ఉత్తర్వుపై సీపీఎం ఎంపీ ఎస్. వెంకటేశన్ తీవ్రంగా స్పందించారు. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన అంశాలను ఆర్టీఐ పరిధి నుంచి తప్పించడం వల్ల ప్రభుత్వ చర్యలపై ప్రజల పర్యవేక్షణ తగ్గుతుందని ఆయన ఆరోపించారు.కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థుల అరెస్టులు, నిరసనల అణచివేత, కస్టడీ మరణాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎంకే ప్రతినిధి శరవణన్ కూడా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రంలోని నేరాల గణాంకాలపై ప్రశ్నలు అడగకుండా ఉండేందుకే ఈ మార్పు తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు.

ప్రస్తుతం సెప్టెంబర్ 21న జారీ చేసిన ఆర్టీఐ మినహాయింపు ఉత్తర్వు రద్దు కావడంతో పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) శాఖకు సంబంధించిన సమాచారంపై ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తులు చేసుకునే అవకాశం కొనసాగుతుంది.

# ఏపీ వ్యాప్తంగా హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు.. 25 మూసివేత

- మొదటి పేజి తరువాయి

ఉల్లంఘనలు బయటపడటంతో 25 సంస్థలను తక్షణమే మూసివేయించారు.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏకకాలంలో 66 హోటళ్లు, ఇతర ఆహార విక్రయశాలల్లో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల వివరాలతో కూడిన నివేదికను వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్‌కు అధికారులు సమర్పించారు. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్, ఆహార భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ సి. అరుణ్ బాబు పర్యవేక్షణలో ఈ ఆకస్మిక తనిఖీలు జరిగాయి. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్ నేతృత్వంలోని బృందాల్లో 40 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, 13 మంది అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు పాల్గొన్నారు.నిబంధనలు పాటించని కారణంగా మూసివేసిన వాటిలో అనకాపల్లిలోని ఓ ధాబా, నెల్లూరు జొన్నవాడ రోడ్డులోని మరో ధాబా, నెల్లూరు ట్రంక్ రోడ్డులోని ఓ హోటల్, విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని టిఫిన్ సెంటర్, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ భోజనశాల ఉన్నాయి.వీటితో పాటు, స్వల్ప ఉల్లంఘనలు గుర్తించిన మరో 45 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనల కింద మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మూసివేసిన హోటళ్ల యాజమాన్యాలు ఆహార భద్రతా నిబంధనల ప్రకారం అవసరమైన మార్పులు చేసుకోవాలని, లోపాలను సరిదిద్దుకున్న తర్వాతే తిరిగి తెరుచుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులోనూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

## ప్రజలే ప్రథమం,పరిష్కారమే పరమార్థం పవన్ కళ్యాణ్ బాటలో జనసేన!





**కూటమి అభ్యర్థులను గెలిపించండి నెల్లూరు నగర అభివృద్ధికి బాటలు వేయండి....**
**- కిషోర్ గునుకుల-జనసేన**

**నెల్లూరు సెప్టెంబర్ 27 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ, గత కొన్ని రోజులుగా జనసేన వీరమహిళ విజయలక్ష్మి గునుకుల, జనసేన నాయకులు కిషోర్ గునుకుల ఆధ్వర్యంలో పాత 16వ డివిజన్ ప్రస్తుత 21వ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం ఈరోజు కూడా ఉత్సాహంగా సాగింది.
ఈ సందర్భంగా ప్రతి గడపను పలకరిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.
ముఖ్యంగా నెల్లూరు నగరాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లే చర్యలను కూడా ప్రస్తావించారు.
ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పాలనా విధానంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న తీరును కూడా ప్రజలకు వివరించారు.
"ప్రజల వినతి తక్షణ స్పందన పరిష్కార దిశగా చర్యలు" అనే విధానానికి ఉదాహరణగా పిఠాపురం పర్యటనలో ప్రజలు అందించిన వినతులపై ప్రభుత్వం స్పందించి, 12 గంటల్లోనే 12 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ప్రచారంలో ప్రస్తావించారు.
ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.
అదేవిధంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా ముందుకు సాగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, కేంద్రరాష్ట్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఉందని ప్రజలకు వివరించారు. ×వీఖీ ప్రచురణలో కూడా భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినట్లు పేర్కొంది.
నెల్లూరు నగర అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కూటమి అభ్యర్థులకు మీ విలువైన మద్దతు అందించి గెలిపించాలని ప్రతి గడపను కోరారు.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల , విజయలక్ష్మి గునుకుల, ప్రవల్లిక, ప్రశాంతి, విజయ, సునీత, కృష్ణవేణి, కుమారి,కృష్ణారెడ్డి, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ వి చీప్ పాలిటిక్స్-మంత్రి నారాయణ.

**నెల్లూరు నగరాభివృద్ధికి పెద్దపీట**
**రూ.60 కోట్లతో ఆధునిక మార్కెట్**
**రూ.46 లక్షలతో రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపన**





**నెల్లూరు సెప్టెంబర్ 27 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

విమర్శకులు నోళ్లు మూసేలా నెల్లూరు నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. 4వ డివిజన్ కృష్ణవేణి స్కూల్ వీధిలో రూ.16 లక్షలతో, 7వ డివిజన్ వైవీఎం ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. 9వ డివిజన్ నవాపేటలో రూ.60 కోట్లతో చేపట్టనున్న ఆధునిక మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు నగరంలో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 2028 జూన్ 12 నాటికి నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12లోపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తికాక నిధులు వెనక్కి వెళ్లాయని, ప్రస్తుతం మళ్లీ నిధులు తీసుకొచ్చి పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు.
నగరాన్ని దోమలులేని నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలకు సీఎం రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు.
వ్యాపారులకు అనుకూలంగా మోడ్రన్ మార్కెట్ నవాపేట మార్కెట్ యార్డులో రూ.60 కోట్లతో ఆధునిక మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తొలిదశలో రూ.13 కోట్లతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.
మార్కెట్ నిర్మాణంపై వ్యాపారులతో చర్చించి, వారి అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడతామని వెల్లడించారు.నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, స్విమ్మింగ్ పూల్స్ వంటి సదుపాయాలను కూడా కల్పిస్తామని మంత్రి తెలిపారు.
తనపై వస్తున్న ఆరోపణలపై,విమర్శలపై మంత్రి స్పందించారు .ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పేదల అభ్యున్నతికి సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నానని చెప్పారు. అసత్య ఆరోపణలను ప్రజలు విశ్వసించరని, తాను వాటిని పట్టించుకోనని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, కార్పొరేషన్ ఈఈ అనీల్‌కుమార్, డీఈ శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ టీడీపీ నేతలు బాలాజీ, రాజశేఖర్, వ్యాపార సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు మనం ఇచ్చే సంపద చెట్లే





**పర్యావరణ పరిరక్షణలో కీలకమైన మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత**
**200 మొక్కలతో ఎంతో మంచి కార్యక్రమం చేపట్టిన బీవీఎస్ స్టార్ సిటీ శేషయ్యకు అభినందనలు**
**తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి యువనాయకులు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతి**
**లిబీవీఎస్ స్టార్ సిటీ అధినేత శేషయ్య ఆధ్వర్యంలో 200 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన యువనేతలు**

**నెల్లూరు సెప్టెంబర్ 27 పెన్ పవర్ నెల్లూరుబ్యూరో**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతున్నాంప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాంవచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్థానాల్లో విజయం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నాం.
యువత రాజకీయాల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేయడం శుభపరిణామం ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి చేకూర్చడంలో యువత కీలకపాత్ర పోషించాలిప్రజలకు సోమిరెడ్డి కుటుంబం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.
పర్యావరణ పరిరక్షణలో భాగంగా నరుకూరులో బీవీఎస్ స్టార్ సిటీ శేషయ్య ఆద్వర్యంలో 200 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉంది.భావితరాలకు మనం ఇచ్చే సంపద ఈ మొక్కలు, చెట్లేపచ్చదనాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందిశేషయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలిప్రజాపయోగ కార్యక్రమాల విషయాల్లో అధికారులు అడ్డుతగలడం సరికాదుఏదేని సమస్య వస్తే పరిష్కార మార్గాలు చూసుకోవాలి..కానీ ఆ పనులను పూర్తిగా ఆపేస్తే సహించబోం పంచాయతీ పరిధిలో 100 వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన శేషయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు గ్రామాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

## గోను శివకుమార్ మృతి బాధాకరం

**హరిజనపాలెంలో ఒక శకం ముగిసింది: ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్**



**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 27:**

గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర ఎస్సీ కమిటీ మాజీ సభ్యుడు,గోను శివకుమార్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరై శివకుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ**
శివకుమార్ అకాల మరణం ఎంతో బాధాకరమన్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ హరిజనపాలెంలో తమకు పెద్ద దిక్కుగా శివకుమార్, గోపాలన్న ఉండేవారని గుర్తుచేశారు. తాము కళాశాలలో చదువుకునే రోజుల్లో వారిద్దరూ ఎన్నో సూచనలు, సలహాలు అందించారని తెలిపారు.
ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, రాజకీయ విషయాల్లోనూ తమకు సలహాలు ఇచ్చేవారని సునీల్ కుమార్ పేర్కొన్నారు. శివకుమార్ లేని లోటు తమకు ఎప్పటికీ తీరనిదని అన్నారు.
శివకుమార్ కుటుంబ సభ్యులకు భగవంతుడు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
హరిజనపాలెంలో శివకుమార్ వంటి పెద్దలను కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఆయన మృతితో ఒక శకం ముగిసినట్లైందని ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు.
ఈ సంతాప సభలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని శివకుమార్‌కు నివాళులర్పించారు.

# పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | తిరుపతి | చిత్తూరు | వై.ఎస్.ఆర్. కడప

## మాట నిలబెట్టుకున్నాం.. 11 ఏళ్ల షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం






**- రూ.22 కోట్ల వేతన బకాయిల విడుదలపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హర్షం**
**- రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కార్మికుల సంక్షేమానికే పెద్దపీట వేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు లి**
**- నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మీడియా సమావేశం**
**- త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో యువతకు ఉపాధి, రైతులకు మేలు జరిగేలా భవిష్యత్తు ప్రణాళికలు**

**నెల్లూరు సెప్టెంబరు 27 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా తీరని లోటుగా ఉన్న కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల వేతన బకాయిల సమస్యకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించింది. దాదాపు 11 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.22 కోట్ల వేతన బకాయిలను ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విడుదల చేయడంపై కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

**కార్మికుల కన్నీళ్లు చూసి ఇచ్చిన హామీ.. నేడు నెరవేరింది**

తనకు మొదటిసారి ఎమ్మెల్యే టిక్కెట్ ప్రకటించిన తర్వాత లేగుంటపాడులో నిర్వహించిన సమావేశంలో కార్మికులు స్వయంగా వచ్చి తమ కష్టాలు వివరించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తుచేసుకున్నారు. 'అప్పటి వరకు కోవూరులో ఒక షుగర్ ఫ్యాక్టరీ ఉందనే విషయంగానీ, అది మూతపడి కార్మికులకు 11 ఏళ్లుగా జీతాలు అందలేదనే విషయం కానీ నాకు తెలియదు. ఆ రోజు కార్మికుల ఆవేదనను చూసి మాటిచ్చాను. మన కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి బకాయిలు ఇప్పిస్తానని చెప్పాను' అని వివరించారు.

**సీఎం చంద్రబాబు , ఎంపీ వేమిరెడ్డి చొరవతో ముందుకు..**

ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు నాయుడు బుచ్చిరెడ్డిపాళెం వచ్చినప్పుడు షుగర్ ఫ్యాక్టరీ వేతన బకాయిలు, ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధి గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే చెప్పారు. 'అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు , నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , కలెక్టర్ హిమాన్షు శుక్లా తో కలిసి పలుమార్లు సుదీర్ఘంగా చర్చించాం. నేను స్వయంగా అసెంబ్లీ వేదికగా కార్మికుల సమస్యలు వినిపించాను. పరిశ్రమల శాఖ మంత్రి భరత్ తో కలిసి వెళ్లి ఫ్యాక్టరీని కూడా పరిశీలించాను' అని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన నిక్కగల్ నాగేశ్వరరావు సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'ఆయన తీరిక లేకుండా కష్టపడటం వల్ల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వ్యక్తిగతంగా నేను సాయం అందించినప్పటికీ ఆయనను కాపాడుకోలేకపోవడం తీవ్ర విచారకరం' అని అన్నారు.

**అందుకే.. ఆలస్యమైంది...**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమాన్ని ఆలోచించి రూ.22 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కోవూరు ప్రజల తరఫున శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. 'మధ్యలో కొందరు షేర్ హోల్డర్లు కోర్టుకు వెళ్లి లిక్విడేషన్‌పై స్టే తీసుకురావడం వల్ల అనుకున్న సమయానికి కొంత ఆలస్యమైనా, చివరకు ఇచ్చిన మాట ప్రకారం బకాయిలు చెల్లించగలిగాం. ఎన్నో ఏళ్లుగా మిగిలిపోయిన సమస్యలను తీర్చడం ఒక్క కూటమి ప్రభుత్వానికే సాధ్యం' అని స్పష్టం చేశారు.

**కోవూరు యువత, రైతులకు త్వరలోనే శుభవార్త**

షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకోబోతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. 'కోవూరు నియోజకవర్గ రైతాంగానికి, ప్రజలకు, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించేలా ఈ ప్రాంత భవిష్యత్తును మార్చే వినూత్న నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు నాయకత్వంలో తీసుకోబోతున్నాం' అని తెలియజేశారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం




**రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**
**- నియోజకవర్గంలో 850 కోట్ల తో అభివృద్ధి**
**- 1.78 కోట్లతో రెండు బ్రిడ్జిలకు శంకుస్థాపన**
**- బ్రిడ్జిల నిర్మాణంతో రైతుల కష్టాలకు పరిష్కారం**

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 27.**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని దామరమడుగు, కాళయకాగొల్లు గ్రామాలలో కోవూరు కాలవపై1.78 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామరమడుగు లో కోవూరు కాలువ పైనున్న బ్రిడ్జి 2000 సంవత్సరంలో పడిపోయిందని అప్పటినుండి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇంతవరకు నాలుగైదు సార్లు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం మన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బ్రిడ్జి నిర్మాణానికి ఎఫ్డిఆర్ ఫండ్స్ నుండి 90 లక్షల రూపాయలు మంజూరు చేసి త్వరగా పనులు కూడా ప్రారంభించే విధంగా ఈ బ్రిడ్జిని ఇచ్చినందుకు ముందుగా కలెక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పాటూరు, దామరమడుగు, గుమ్మల దిబ్బ, కోవూరు ఎల్లాయపాలెం గ్రామాల ప్రజలందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, రైతులు తాము పండించిన పంటను బయటకు తీసుకెళ్లి అమ్ముకునేందుకు కూడా రవాణాసౌకర్యం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి దిశగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇంతవరకు 850 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. నియోజకవర్గానికి ఇంత చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా నన్నారు. ఈనెల 29న ఉదయగిరిలోని వరికుంటపాడు లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబు పాల్గొంటారని తెలిపారు. జీ రాంజీలో నియోజకవర్గానికి మరో 10 కోట్లు మంజూరయ్యాయని తెలియజేయుటకు సంతోషిస్తున్నానన్నారు. దానికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభించనున్న ట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షులు బెజవాడ జగదీష్, టిడిపి నాయకులు కె.వి శేషయ్య, ఏటూరి శివరామ కృష్ణారెడ్డి, బత్తల హరికృష్ణ, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైసీపీకి బిగ్ షాక్.. టీడీపీలో చేరిన మైనార్టీ సీనియర్ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ శివపురం నూర్ మహమ్మద్, రాజమత్ మన్సూర్ వలి.

**శ్రీశైలం పెన్ పవర్ సెప్టెంబర్ 27**

నంద్యాల జిల్లా శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో 300 కుటుంబాలతో చేరిక
తెలుగుదేశం పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన బుడ్డా రాజన్న పట్టణంలో భారీ ర్యాలీతో ఎమ్మెల్యే బుడ్డా రాజన్నకు ఘన స్వాగతం పలికిన ముస్లిం సోదర సోదరీమణులుఅభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం.



# శ్రీ శ్రీ తాళమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు





**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,27:**
గూడూరు పట్టణ శివారులో వెలసిన గ్రామదేవత శ్రీశ్రీ తాళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.
అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, ఉషారాణి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించి ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాలను శ్రీశ్రీ తాళమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

# వైభవంగా శ్రీ అభయ గణపతి స్వామి నిమజ్జన ఊరేగింపు

**పెన్ పవర్, సెప్టెంబర్,27:**
ద్వారకాతిరుమలలో గణపతి నవరాత్రి వేడుకలు వైభవంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా సంత మార్కెట్ ఆశ్రమ వీధిలోని శ్రీ అభయ గణపతి స్వామి ఆలయం వద్ద గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపు కన్నుల పండువగా సాగింది.
ప్రత్యేకంగా అలంకరించిన పుష్ప వాహనంపై కొలువుదీరిన గణనాథుడు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఊరేగింపులో కోలాటం, యువతను ఉత్సాహపరిచిన డీజే నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గణపతి బప్పా మోరియా నినాదాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపు కోలాహలంగా సాగింది.స్థానిక గ్రామస్థులు,



భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# "అయ్యా... ఒక కిడ్నీ ఇచ్చి నా బిడ్డను బతికించండి"
## కన్నీరుమున్నీరవుతున్న నిరుపేద తల్లి





- 10 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో పోరాటం
- 20 ఏళ్ల యువకుడికి కిడ్నీ దాత కోసం ఎదురుచూపులు

**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 27:**
పది సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో పోరాడుతూ, డయాలసిస్‌పైనే ఆధారపడి జీవిస్తున్న 20 ఏళ్ల యువకుడి దీనస్థితి పలువురిని కలచివేస్తోంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య ఎస్సీ కాలనీకి చెందిన గంధం ఆకాష్ (20) చిన్న వయసులోనే రెండు కిడ్నీలు విఫలమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు.
ఆకాష్ తండ్రి గంధం శ్రీనివాసులు మృతి చెందడంతో తల్లి గీతే కుటుంబానికి అండగా నిలుస్తోంది. 2016 నుంచి రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్‌పై ఆధారపడి జీవిస్తున్న ఆకాష్, ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు ఎన్నో ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఏలూరు, మానస వెంకటరమణ ఆసుపత్రి, తిరుపతి సిమ్స్ తదితర ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నుంచి ఉపశమనం లభించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, నిరుపేద కుటుంబానికి ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రస్తుతం ఆకాష్ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ప్రతి రోజూ తన కుమారుడి ఆరోగ్యం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నామని తల్లి గీత కన్నీరుమున్నీరవుతోంది.

**ఎమ్మెల్యే చొరవతో పెన్షన్ మంజూరు**
ఆకాష్ పరిస్థితిని ఇటీవల తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పందించి అతనికి పెన్షన్ మంజూరు చేయించారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఆకాష్ ఆరోగ్య పరిస్థితికి వైద్యుల సూచన మేరకు కిడ్నీ మార్పిడి అవసరమని, అందుకు భారీగా ఖర్చు అవుతుండటంతో నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని పేర్కొన్నారు.

**దాతల కోసం కుటుంబం వేడుకోలు**
కిడ్నీ మార్పిడి ద్వారా ఆకాష్‌కు కొత్త జీవితం లభించే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మానవతా దృక్పథంతో కిడ్నీ దానం చేయడానికి అర్హత కలిగిన దాతలు ముందుకు వచ్చి ఆకాష్ ప్రాణాలను కాపాడాలని తల్లి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.
"అయ్యా... నా బిడ్డను బతికించేందుకు ఒక కిడ్నీ దాతగా ముందుకు రండి. మా కుటుంబానికి అండగా నిలవండి" అంటూ తల్లి గీత చేస్తున్న వేడుకోలు హృదయాలను కదిలిస్తోంది.కిడ్నీ దానం లేదా సహాయం చేయదలచిన వారు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:
8686942260
9100748746

# స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సమరసన్నాహం
## కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 27:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో స్థానిక ఎన్నికల సంసిద్ధతపై ఆయన అధ్యక్షతన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.
**ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ..** పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ శ్రేణులు అధైర్యపడకుండా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యకర్తల సమస్యలను పార్టీ నాయకత్వం అండగా నిలిచి పరిష్కరించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ పాలనను తీసుకెళ్లాలివైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, గత ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని మధుసూదన్ రెడ్డి కోరారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను కూడా నాయకులు, కార్యకర్తలు తెలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.నిత్యావసర ధరలు, రైతాంగ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలతో విస్తృతంగా చర్చించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికలకు సమష్టి కార్యాచరణస్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు గ్రామ, మండల, పట్టణ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటూ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని మధుసూదన్ రెడ్డి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులుఈ సమావేశంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బిర్రి సుదర్శన రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కొత్తపాటి శ్రీనివాసుల రెడ్డి, అంజూరు వెంకటేష్ బాబు, పగడాల రాజు, మున్నా రాయల్, ఆర్కాడు శంకర్, బులెట్ జయశ్యాం రాయల్, కంఠ ఉదయ్ కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరిద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై రాబోయే ఎన్నికలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# సంస్కారం గురించి కాకాణి మాట్లాడటమా.

**వైసీపీ పాలనలో ప్రభుత్వ భూముల నుంచి కసుమూరు దర్గా హుండీల వరకూ.. అన్నింటిలో దోపిడీ**
**కసుమూరులో భూవివాదానికి, సోమిరెడ్డికి ఏం సంబంధం**
**వెకిలి మాటలతో రెచ్చగొట్టడం మాని హుందాతో నడుచుకోవాలని హితవుపలుకుతున్నాం**
**వెంకటాచలం మండలం కసుమూరులో మీడియాతో టీడీపీ నాయకులు ఓరేపల్లి మస్తాన్ రావు**



**నెల్లూరు సెప్టెంబర్ 27 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
సర్వేపల్లి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై దుష్ప్రచారం చేయడమే పనిగా కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉన్నాడు
తెల్లారి లేచినదగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు సోమిరెడ్డి భజనే
కసుమూరులో జరుగుతున్న భూవివాదంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు..లేదంటే కోర్టును ఆశ్రయించవచ్చు
అక్కడ ఏం జరుగుతుందో కూడా తెలియకుండానే సోమిరెడ్డి భూకబ్జా అంటూ మాట్లాడటం దుర్మార్గంనోరుందని ఎట్లపడితే అలా మాట్లాడటం కాదు...ఆరోపణలు చేసినా వాస్తవాలకు దగ్గరగా ఉండాలి40 ఏళ్ల రాజకీయ జీవితంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై ఎలాంటి అవినీతి మరకలు లేవుఅధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో దుర్మార్గాలు, అరాచకాలు చేసిన కాకాణి మా నాయకుడిపై అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటుసంస్కారం అనే పదం మాట్లాడే అర్హత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఎక్కడిది
మా నాయకులు మాకు నేర్పిన ప్రధాన అంశాలు నీతి, నిజాయతీ, సంస్కారంఅదే వైసీపీ నాయకులను కాకాణి అవినీతి, అక్రమాలు, దోపిడీ, భూదందాలు చేయడంలో ప్రోత్సహించారుకసుమూరు బజారులో కాసేపు తిరిగి ఎవరిని అడిగినా వైసీపీ పాలనలో కాకాణి అండ్ బ్యాచ్ చేసిన అరాచకాల జాబితా చెబుతారువెంకటాచలంలో ఉండే కాకాణి రైట్ హ్యాండ్ కసుమూరులో చేసిన భూదందాలకు అంతే లేదుఒక్క సెంటు భూమి లేని ఆ నాయకుడికి కసుమూరులో 16 ఎకరాలు ఎలా వచ్చాయివైసీపీ అధికారంలోకి రాకముందే ఆయన ఆర్థిక పరిస్థితి ఏంది..ఈ రోజు ఆర్థిక పరిస్థితి ఏంటికసుమూరులో ఉండే మరో నాయకుడుదీ అదే పరిస్థితి
మా ఊరి పరిధిలో ఉండే కనుపూరు కాలువలో ఒక్క తట్ట మట్టి ఎత్తకుండానే బిల్లులు చేసుకున్నారు రెగ్యులేటర్ల చెక్కలు మార్చకుండానే మార్చినట్టు లక్షలకు లక్షలు దోచుకున్నారుకసుమూరు దర్గా హుండీ డబ్బులు కూడా దోచుకున్న పాపాత్ములు వైసీపీ నాయకులుగోవర్ధన్ రెడ్డి అత్యాశకు ఎందరో రెవెన్యూ అధికారులు బలైపోయారు
ఏఐలో సెర్చ్ చేస్తే కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన పాపాలు, అరాచకాలు మొత్తం వరుసగా కనిపిస్తాయి
హుందా రాజకీయాలు చేయాలని ఒక విద్యావంతుడిగా కాకాణికి హితవు పలుకుతున్నాను
నిర్మాణాత్మక విమర్శలు చేయండి స్వాగతిస్తాం...వెకిలి మాటలతో రెచ్చగొట్టవద్దని హెచ్చరిస్తున్నాం.

# విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి

**కార్మికుల సమస్యలను పరిష్కరించాలి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముజఫర్ అహ్మద్**



ఈ సందర్భంగా ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ..

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 27:**
విద్యుత్ రంగంలో చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి చేపట్టిన బైక్ ర్యాలీ ఆదివారం శ్రీకాళహస్తికి చేరుకుంది.
శ్రీకాళహస్తికి చేరుకున్న ర్యాలీకి స్థానిక విద్యుత్ కార్మికులతో పాటు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తి ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.
గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తాకట్టు పెట్టి లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం మోపిందంటూ అప్పట్లో కూటమి నేతలు విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ విద్యుత్ సంస్థలకు నష్టం కలిగించే ఒప్పందాలనే కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.
విద్యుత్ సంస్థలకు వస్తున్న నష్టాలకు కార్మికులు, ఉద్యోగులే కారణమంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, తెలంగాణ తరహాలో రూ.48 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా 2018 నుంచి నిలిపివేసిన ఉద్యోగుల డీఏను పునరుద్ధరించాలని, పీఆర్‌సీ కమిటీని ప్రకటించాలని, పాత పెన్షన్, హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.
విద్యుత్ రంగంలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న తిరుపతిలోని ట్రాన్స్‌కో సీఎండీ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ రవికుమార్, జాయింట్ సెక్రెటరీ రవి అబ్దుల్లా, మురళి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకం..మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

- నాయుడుపేటలో ఘనంగా 'శ్రీ బాలాజీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్' ప్రెస్ క్లబ్ ప్రారంభం
- ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ అనుసంధానకర్తలు జర్నలిస్టులే.. మాజీ ఎంపీ నెలవల
- నిజాయితీ, నిర్భయ పాత్రికేయంతోనే సమాజ హితం సాధ్యం: ప్రెస్ క్లబ్ వేదికగా ప్రముఖుల పిలుపు
- జర్నలిస్టుల సంక్షేమానికి, హక్కుల సాధనకు నిరంతరం అండగా ఉంటా.. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం హామీ
- ప్రజా సమస్యల పరిష్కారంలో విలేకరుల వేదిక ప్రాధాన్యం అభినందనీయం.. ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో నాయకుల





**పెన్ పవర్ నాయుడుపేట సెప్టెంబర్ 27**
తిరుపతి జిల్లా నాయుడుపేటప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని తిరుపతి మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు.లి నాయుడుపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రెస్‌క్లబ్ భవనాన్ని ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధులుగా విలేకరులు పనిచేస్తారని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలు, గొంతు వినిపించుకోలేని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 1980ల కాలంలో నాయుడుపేటలో సుమారు 15 వేల మంది ఓటర్లు మాత్రమే ఉండేవారని, పారిశ్రామిక అభివృద్ధి, పట్టణ విస్తరణ కారణంగా ప్రస్తుతం జనాభా లక్ష దాటిందని ఆయన గుర్తుచేశారు. పట్టణంలో ఓటర్ల సంఖ్య 50 వేలకు పైగా పెరిగిందన్నారు. తిరుపతి, నెల్లూరు వంటి ప్రధాన నగరాల తరహాలో నాయుడుపేటలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎంతటి ఉన్నతమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారో, ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు కూడా అంతే బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తారని నేలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ఏదైనా సరే వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను ప్రచురించాలని సూచించారు. ప్రజా సమస్యలను నిజాయితీగా, నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇతర మౌలిక వసతులు కల్పించే అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఝమస్యల పరిష్కారానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు.టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలపై ప్రెస్‌క్లబ్ వేదికగా ఐక్యంగా పోరాడాలని సూచించారు. నాయుడుపేట నుంచి తిరుపతి పార్లమెంట్ స్థాయి వరకు ఎదిగిన నేలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కుటుంబం ఎల్లప్పుడూ మీడియా ప్రతినిధులకు అండగా ఉంటుందని అన్నారు. విలేకరులు ప్రచురించే వార్తలను ప్రజాప్రతినిధులు సద్విమర్శలుగా స్వీకరించి, వాటి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అవధానం సుధీర్ పేర్కొన్నారు. టీడీపీ పట్టణ కమిటీ తరఫున నూతన ప్రెస్‌క్లబ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ నాన్నబాల సుబ్బారావు మాట్లాడుతూ నేలవల కుటుంబానికి జర్నలిస్టులంటే ప్రత్యేక గౌరవం, అభిమానం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లి, వాటి ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, జర్నలిస్టుల మధ్య నమ్మకమైన వాతావరణం ఉండాలని నాన్నబాల సుబ్బారావు అన్నారు.జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వాస్తవికంగా ప్రజలకు చేరవేయడంలో మీడియా మరింత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. టీడీపీ పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి నిత్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన శ్రీ బాలాజీ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తి గౌరవం కోసం ఈ వేదిక ఉపయోగపడాలని అన్నారు.సీనియర్ నాయకుడు పసుల గంగా ప్రసాద్ మాట్లాడుతూ నాయుడుపేటలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు ఐకమత్యంతో ఉంటూ తమ హక్కుల సాధనకు, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.సమాజ హితం కోసం ఎల్లప్పుడూ వాస్తవాధారిత వార్తలను మాత్రమే ప్రజలకు అందించాలని పసుల గంగా ప్రసాద్ కోరారు. ప్రజల పక్షాన నిలబడి నిష్పాక్షికంగా పనిచేసినప్పుడే జర్నలిజానికి మరింత గౌరవం లభిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా బాధ్యతను ప్రతి జర్నలిస్టు గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వార్త చంద్రరాజు, ఉపాధ్యక్షులు గల్లా శ్రీనివాసులు, అడ్వకేట్ ధారా రవి, సీనియర్ టిడిపి నాయకులు ఎస్ జె రాజేష్ అడ్వకేట్ మేర్లపాక శ్రీనివాసులు, మైలారి రాజశేఖర్, బీసీ నాయకులు జులపాటి మస్తాన్, జి.వి.ఆర్.నాయుడు, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ధారా అరుణ్, నెలవల చంద్రశేఖర్, కురుగొండ రమేష్, కావ్య, వెంకీ, ఎన్.ఎం.బాబు, అరిగెల ప్రసాద్, తణుకు చందు, మావుదూరు చిరంజీవి, శ్రావణ్ మరియు జిల్లా కమిటీ అధ్యక్షులు అరవ జయపాల్ ఎం హరి కె హరిబాబు తదితరులు హాజరయ్యారు.లిప్రజాప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ కేసులకుభయపడం - కాకాణి...

**తిరుపతి జిల్లా,పెళ్ళకూరులో ఇటీవల అక్రమ కేసులో అరెస్టై, జైలుకు వెళ్ళిన నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య తో కలిసి పరామర్శించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి...**

- **సత్యనారాయణ రెడ్డి గారి కుటుంబానికి ధైర్యం చెప్పి, పార్టీ అండగా ఉంటుందని కాకాణి హామీ.**
- **సత్యనారాయణ రెడ్డిపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది**
- **గతంలోనూ 97 రోజుల పాటు అక్రమ కేసులు, పిటి వారెంట్లతో జైలుకు పంపారు**
- **'గుడ్ మార్నింగ్ పెళ్ళకూరు' కార్యక్రమానికి లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే వేధింపులు.**
- **స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే పోలీసులు పర్యటనలను అడ్డుకుంటున్నారు**
- **సత్యనారాయణ రెడ్డి వాహనం సీజ్ చేయడం, కార్యకర్తలపై దాడులు చేసి అరెస్ట్ చేయడాన్ని ఖండించిన కాకాణి.**
- **పోలీసులు బనాయిస్తున్న అక్రమ కేసులు విషయంలో కోర్టులు కూడా రిమాండ్ తిరస్కరిస్తున్నాయి**
- **వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు**
- **సొంత పొలంలో పనులు చేసుకుంటుంటే టీడీపీ నేతలు అడ్డుపడి దాడులు చేశారు**
- **అధికారుల ముందే గుండెపోటుతో వ్యక్తి చనిపోతే, దాన్ని మర్డర్ కేసుగా మార్చారు**
- **ప్రశ్నించే వారిని జైలుకు పంపుతామనే సంకేతం ఇచ్చేందుకే కూటమి ప్రభుత్వం కుట్రలు**
- **అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటాం**





**పెళ్లకూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 27**

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు పరామర్శించి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...

సత్యనారాయణరెడ్డిపై కక్షసాధింపు చర్యలు..

నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పై రాజకీయ కక్షసాధింపుతో అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేశారని కాకాణి మండిపడ్డారు.

సత్యనారాయణరెడ్డిపై కక్షగట్టి గతంలో దాదాపు 97 రోజుల పాటు అక్రమ కేసులు, పిటి వారెంట్లు వేసి జైలుకు పంపారని ఆరోపించారు.

జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకు స్థానిక నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు రకరకాలుగా వేధించారని విమర్శించారు.

'గుడ్ మార్నింగ్ పెళ్లకూరు అనే కార్యక్రమం ద్వారా గ్రామీణ పర్యటనలకు శ్రీకారం చుడితే, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక పోలీసులు ఆయన పర్యటనలను అడ్డుకుంటున్నారని అన్నారు.

పర్యటనలకు వెళ్లకుండా ఆంక్షలు విధించడమే కాకుండా, ఆయన వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు.

ఆయనతో పాటు ఉన్న కార్యకర్తలపై దాడులు చేసి, అసభ్యంగా ప్రవర్తించి అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు.కోర్టులు కూడా రిమాండ్ తిరస్కరించే స్థాయి కేసులు పెడుతూ, పోలీసులు పూర్తిగా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని కాకాణి తీవ్ర స్థాయిలో విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులను భయాందోళనలకు గురిచేసేందుకే అక్రమ కేసులు...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని కాకాణి ఆరోపించారు. సొంత పొలంలో బాట వేసుకుంటున్న సమయంలో, అక్కడున్న అధికారులతో ఎలాంటి సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి అడ్డుకోవడమే కాకుండా దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారని ఆయన పేర్కొన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చి మాట్లాడిన ఒక వ్యక్తి గుండెపోటుతో మరణించాడని, ఈ విషయాన్ని స్వయంగా అక్కడున్న అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మర్డర్ కేసు నమోదు చేసి జైలుకు పంపిందని మండిపడ్డారు. "మాకు ఎవరు ఎదురుతిరిగినా, మా దోపిడీని ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతాం" అనే సంకేతాన్ని పంపడానికే కూటమి ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

అక్రమంగా నిర్బంధించబడిన సత్యనారాయణ రెడ్డి ఎంతో ధైర్యంగా ఉన్నారని, నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబ సభ్యులు బాధపడుతున్నప్పటికీ ఆయన అక్రమ కేసులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గతంలో సత్యనారాయణ రెడ్డి జైలుకి వెళ్ళినప్పుడు, వారి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించామని, మళ్లీ ఇప్పుడు వచ్చి పరామర్శించడం బాధగా ఉందన్నారు, ఈ విషయంపై వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తో చర్చించామని, న్యాయపరంగా పోరాటం చేసి బెయిల్ పొందేందుకు అవసరమైన న్యాయ నిపుణులను, న్యాయవాదులను ఏర్పాటు చేయాలని జగన్ గారు సూచించినట్లు వెల్లడించారు.

కేసుకు సంబంధించి బెయిల్ వస్తుందనే నమ్మకం ఏర్పడిన ప్రతిసారీ ప్రభుత్వం ఏదో ఒక కొత్త నాటకానికి తెరతీస్తూ, విచారణ పేరుతో కస్టడీ పిటిషన్లు వేస్తూ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు.. భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కావాలని అక్రమ కేసులు బనాయిస్తోందని, ఇటువంటి బెదిరింపులకు వైఎస్సార్సీపీ భయపడదని కాకాణి స్పష్టం చేశారు కూటమి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

అధికారులకు హెచ్చరిక..

అధికారంలో ఉన్నామనే అహంకారంతో తప్పుడు కేసులకు వత్తాసు పలుకుతున్న అధికారులకు కాకాణి హెచ్చరికలు జారీ చేశారు,"ఏ రోజు అధికారం శాశ్వతం కాదు,రేపు అధికారం మారిన రోజు, అక్రమ కేసులు పెట్టిన అధికారులు, దానికి ప్రోత్సహించిన వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది" అని అన్నారు వైఎస్సార్సీపీ సుదీర్ఘ పోరాట పటిమ..

వైఎస్సార్సీపీ అనేక ఒడిదుడుకులను అధిగమించి వచ్చిందని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాటి కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించి, జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధపడి తాను నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడారని గుర్తుచేశారు , ఇటీవల జైలులో ఉన్న సత్యనారాయణ రెడ్డి ని పరామర్శించామని, ఆయన మానసికంగా చాలా ధైర్యంగా ఉన్నారని తెలిపారు, జైలులో పెడితే తగ్గుతారనుకోవడం కూటమి ప్రభుత్వ భ్రమ అని కొట్టిపారేశారు

పోలీసుల తీరుపై విమర్శలు..

జిల్లా ఎస్పీ గారు, పోలీసు యంత్రాంగం పైవారి ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ కేసులు బనాయించడం,సంబంధం లేని సెక్షన్లు పెట్టడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు

ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా చట్టపరంగా, న్యాయపరంగా పోరాటం చేస్తామని, రేపటి రోజున ప్రభుత్వ మార్పిడి తర్వాత అన్ని విచారించి ఆధారాలతో సహా సమాజం ముందు పెట్టి అన్యాయంగా ప్రవర్తించినవారికి తగిన బుద్ధి చెప్తామని కాకాణి స్పష్టం చేశారు

ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ, అరెస్టులకు పాల్పడుతున్న తీరును కాకాణి ఖండించారు, ఇటువంటి కక్షసాధింపు చర్యలు సమాజానికి, రాజకీయ సంప్రదాయాలకు మంచిది కాదని హెచ్చరించారు. ఈ రోజు అధికారంలో ఉండి కూటమి నాయకులు చేస్తున్న ఈ అక్రమ అరెస్టులు, తిట్ల సంస్కృతి రేపు మీకే చుట్టుముడుతుందని కాకాణి స్పష్టం చేశారు. రేపు ఇదే పరిస్థితులు మీకు ఎదురైతే మానసికంగా, శారీరకంగా తట్టుకోవడం కష్టమవుతుందని గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు జగన్ మోహన్ రెడ్డి నుంచి గుండె ధైర్యం వారసత్వంగా వచ్చిందని, ఎవరూ బెదిరింపులకు, అరెస్టులకు భయపడరని చెప్పారు.

రెట్టింపు ఉత్సాహంతో పోరాటం..

గతంలో 97 రోజులు జైల్లో పెట్టినా సత్యనారాయణ రెడ్డి ఎక్కడా తగ్గ లేదని, బయటకు వచ్చిన తర్వాత రెట్టింపు ఉత్సాహంతో ప్రజల కోసం పోరాడారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ అక్రమ కేసులు పెట్టినా, బయటకు వచ్చిన తర్వాత మూడు రెట్ల ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తాడని,ఆయన వెంట వైఎస్సార్సీపీ నేతలు నిలబడతారని, ప్రశ్నిస్తారని తేల్చి చెప్పారు.

అండగా వైఎస్సార్సీపీ..

సత్యనారాయణ రెడ్డికి, ఆయన కుటుంబానికి జగన్ మోహన్ రెడ్డితో పాటు పార్టీ మొత్తం పూర్తి అండగా ఉంటుందని కాకాణి హామీ ఇచ్చారు. అక్రమ కేసులకు, అరెస్టులకు కారణమైన అధికారులు, బాధ్యులైన వ్యక్తులు భవిష్యత్తులో ఖచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని కాకాణి తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వనగర్ చామకాలువ పై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 27**

నంద్యాల.. 4 కోట్ల రూపాయలతో విశ్వనగర్ చామకాలువ పై బ్రిడ్జి నిర్మాణ మరియు శ్రీరామ థియేటర్ పక్కన నుండి విశ్వనగర్ వరకు నూతనంగా నిర్మించతలపెట్టిన సిమెంటు రోడ్డు పనులకు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేశారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు . శ్రీరామ థియేటర్ పక్కన నుండి విశ్వనగర్ వరకు ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన సిమెంటు రోడ్డుతో పాటు చామకాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈ వంతెన మరియు రోడ్డు నిర్మాణం పూర్తయితే విశ్వనగర్ పరిసర ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరుతుంది, ప్రయాణ కష్టాలు శాశ్వతంగా తీరిపోతాయని అన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమానికి 17వ వార్డు (విశ్వనగర్) తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఎం. రామ మద్దయ్య , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, జిల్లెల్ల శ్రీరాములు, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, కళ్యాణ్ , చలం బాబు, శివ శంకర్ యాదవ్ , తిమ్మయ్య , జెపి , వడ్డె జనార్ధన్ , మంజుల సుబ్బరాయుడు , మిద్దె ఉసేని , గొసుల నాగేశ్వరరావు, కండే శ్యాంసుందర్ లాల్, రామలింగారెడ్డి, రాము మరియు మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# విజయవంతంగా 72వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం..

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 27**

న్నాధ్యాల లో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ మౌలాలి రెడ్డి , చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 72వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తనకు జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు డాక్టర్ పెద్దిరెడ్డి



దస్తగిరి రెడ్డి సేవలు అభినందనీయమనీ అన్నారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 72వ మెగా వైద్య శిబిరంలో 1200మంది రోగులకు



ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్, షేక్షావలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి , ముక్కు , గొంతుకు సంబందించిన జబ్బులకు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి జిల్లా రెవెన్యు అధికారి టి .ఏ .వి నాగలక్ష్మి



**పెన్ పవర్, సెప్టెంబర్,27:**

తెలంగాణ ప్రభుత్వం మరియు కమీషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మేరకు జిల్లా కలెక్టర్,మహబూబాబాద్ అనుమతితో శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యు అధికారి టి .ఏ .వి నాగలక్ష్మిముఖ్య అతిదిగా పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్బంగా అధికారి మాట్లాడుతూ, తెలంగాణ లో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆమే చూపిన ధైర్య సాహసాలను మరియు స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సి హెచ్ .సాయిశ్రీజ మరియు వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు,ఐ డి ఓ సి కార్యాలయ సిబ్బంది మరియు జిల్లాలోని రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్





**పెన్ పవర్, సెప్టెంబర్,27:**

కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలో సిరబోయిన విక్రాంత్, తండ్రి శ్రీధర్ కి ఈ నెల 21న డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిన నేపథ్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ శనివారం బాధితుని నివాసాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్ మరియు వైద్య సిబ్బందితో కలిసి బాధితుని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరుగుదలను గుర్తించి, వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే ఇంటిలో మరియు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో కూడా దోమల నివారణ మందును స్ప్రే చేయించారు.

ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా మరియు సామూహికంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొత్తగూడ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వరం ఉన్నవారిని గుర్తించి అవసరమైన పరీక్షలు మరియు వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశించారు.

అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు డెంగ్యూ, మలేరియా మరియు ఇతర సీజనల్ జ్వరాల నివారణలో భాగంగా తమ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వర బాధితులను గుర్తించి, అవసరమైన పరీక్షలు మరియు చికిత్స అందించాలని ఆదేశించారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇళ్లలో మరియు చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి, వైద్య సిబ్బంది మరియు ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు




**పెన్ పవర్, సెప్టెంబర్,27:**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం ఎస్పీ కార్యాలయంలో శనివారం చాకలి ఐలమ్మ 131 వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ సంగ్రాం సింగ్ జి పాటిల్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల నిధులు స్పర్శ్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ





**పెన్ పవర్, సెప్టెంబర్,27:**

కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఈ రోజు కోరుట్ల మండలంలోనిప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్పర్శ్ విద్య నిధుల వినియోగంపై రాష్ట్రరిసోర్స్ పర్సన్ మార్గం రాజేంద్రప్రసాద్ శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం మాట్లాడుతూ విద్యాశాఖ పాఠశాల వారి నిధుల విడుదల చేసినందున వాటి వినియోగంలో ప్రభుత్వ నియమాళిని అనుసరించి ఖర్చు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులువి.గంగాధర్,బి.ఆనందరావు,జోష్ణ,భారీప్రధానోపాధ్యాయులు,సి.ఆర్.పిలు పి.గంగాధర్, దేవేందర్, జ్యోతి,మన్వితలు పాల్గొన్నారు.

# కొల్లాపూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.



**పెన్ పవర్, సెప్టెంబర్,27:**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటాన్ని,ఆమె ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ,సమానత్వం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 11,12,13,14 వార్డుల్లో పర్యటించి.. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లపై మున్సిపల్ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే జూలకంటి

**పెన్ పవర్, సెప్టెంబర్,27**

మాచర్ల పట్టణంలోని 11,12,13,14వ వార్డుల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యటించి, కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, నూతనంగా నిర్మించాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లపై మున్సిపల్ అధికారులతో సమీక్షించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఘనంగా టిడ్కో గృహ ప్రవేశ మహోత్సవం




- 560 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీ
- డిసెంబర్ 2026 నాటికి మిగిలిన ఇళ్లన్నీ పూర్తి చేసి అందజేస్తాం
- మినీ టౌన్‌షిప్ తరహాలో గేటెడ్ కమ్యూనిటీ వసతులు
- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 27:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నంద్యాల పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎ.పి.టిడ్కో – పి.యం.ఎ.వై (అర్బన్) ఎన్.టి.ఆర్ నగర్ గృహ ప్రవేశ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నంద్యాల పట్టణంలోని ఎస్.ఆర్.బి.సి కాలనీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 560 మంది లబ్ధిదారులకు నూతన గృహాల తాళాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, ఇంచార్జి కలెక్టర్ సూరజ్ ధనంజయ్ గనోర్ అందజేశారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సొంత ఇల్లు లేని పేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ ముఖ్య సంకల్పమని తెలిపారు . అర్హత కలిగిన ప్రతి నిరుపేదకూ పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడతామని తెలిపారు. కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా, పూర్తి నిష్పక్షపాతంగా సచివాలయాల ద్వారా సర్వే నిర్వహించి, సోషల్ ఆడిట్ పూర్తి చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా నిరుపేదలపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా ఉండాలని, రూ.6.55 లక్షల విలువైన 300 చదరపు అడుగుల ఇంటిని కేవలం రూపాయికే (రూ.1/-) అందిస్తున్నామని చెప్పారు. అలాగే 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు చెల్లించాల్సిన ముందస్తు వాటా మొత్తంలో 50 శాతం రాయితీ కల్పించి పేదలకు అండగా నిలిచామన్నారు. లబ్ధిదారులకు ఉచితంగా స్థలాన్ని ఇవ్వడమే కాకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నామని తెలిపారు. వివిధ కారణాల వల్ల గతంలో ఇళ్లు రాని లబ్ధిదారులకు వారు చెల్లించిన వాటా సొమ్మును నేరుగా వారి ఖాతాల్లోకే రీఫండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ రోజు ఎస్.ఆర్.బి.సి లేఅవుట్‌లో 560 మంది లబ్ధిదారులకు స్వయంగా ఇళ్ల తాళాలు అందజేశామని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలను సైతం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026 నాటికి లబ్ధిదారులందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ గృహ సముదాయాలు కేవలం ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, రూ.56.91 కోట్ల వ్యయంతో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, ఎస్టీపీతో పాటు పాఠశాలలు, ఆసుపత్రి, పార్కులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రం వంటి ఆధునిక వసతులతో కూడిన గేటెడ్ కమ్యూనిటీ మినీ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దామని మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఈ పక్కా ఇళ్లు లబ్ధిదారుల కుటుంబాలకు, వారి భావితరాలకు గర్వకారణంగా నిలుస్తాయని అన్నారు . అనంతరం లబ్ధిదారులకు టిడ్కో ఇంటి తాళాలను అందజేశారు అలాగే లబ్ధిదారులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్ , మున్సిపల్ కమిషనర్ శేషన్న, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, 38 వ వార్డు ఇంచార్జీ తాటికొండ బుగ్గరాముడు, తాటికొండ మహేష్ బాబు, కుమ్మరి కోటీశ్వరుడు, కల్కి రాఘవేంద్ర, మల్లయ్య, జిల్లెల్ల శ్రీరాములు, విశ్వనాథ్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాసులు, మెప్మా పీడి వెంకట దాస్, విజయ గౌరీ,సౌభాగ్య,పద్మ, జ్యోష్ణ,వహిదా
మరాఠీ సూరి,ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి గోవింద నాయుడు,కొమ్ము శ్రీహరి, జైలాన్ మరియు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడ్కో అధికారులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సొంతింటి లబ్ధి పొందిన నిరుపేదలు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# దొరతనం పై ఎలుగెత్తిన పొలికేక చాకలి ఐలమ్మ.




**పెన్ పవర్, సెప్టెంబర్,27:**
నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రం లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ, జయంతి ఉత్సవాలు ఘనంగా పెద్ద కొత్తపల్లి విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక తహసిల్దార్ శ్రీనివాసులు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ భగవేని నరసింహులు హాజరయ్యారు. ముందుగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జన్మదినం సందర్భంగా విగ్రహ కమిటీ సభ్యులు, ముఖ్య అతిథులు కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమములో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఐలమ్మ జీవిత విశేషాలను, ఆమె తెగువ, పోరాట పటిమను నేటి తరాల వారు అలవర్చుకోవాలని, ఆ స్ఫూర్తితో నేటి మహిళలుచైతన్యవంతులు కావాలని ఆకాంక్షించారు.
ఆనాడు రజాకారులను, దేశ్ముఖ్ దొరల దాష్టికానికి, ఆగడాలకు ఎదురొడ్డి నిలిచిన దీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. భూమికోసం, భుక్తి కోసం , వెట్టి చాకిరి విముక్తి కోసం సంఘాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజాలు వేసిన ఐలమ్మ భూపోరాటం చారిత్రాత్మకమైనదని వక్తలు కొనియాడారు.
కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. తరువాత కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను ఐలమ్మ విగ్రహ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ చైర్మన్ లింగస్వామి, అలీ అక్బర్, ఇంద్రకంటి పెద్ద బాలస్వామి, సాయిలు, శ్రీనివాసులు, ఆంజనేయులు, ఉమాశంకర్, అలివేల ,రాధ, మణెమ్మ, మశమ్మ, ఇంద్రకంటి చిన్న బాలస్వామి పాల్గొని ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# 28పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం - ఎమ్మెల్యేమద్దిపాటి



**పెన్ పవర్, సెప్టెంబర్,27**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు ద్వారా 3,00,000 రూపాయలు సమకూరింది. ఆదివారం కృష్ణ జిల్లా కోసూరి వాస్తవ్యులు కాకర్ల సురేష్ దంపతులు రూ.2,00,000/–, మరియు మరొక భక్తుడు హనుమాన్ జంక్షన్ వాస్తవ్యులు కొల్లిపర హర్షిత కుటుంబ సభ్యులు 1,00,000/– విరాళాన్ని దేవస్థానం అన్నదాన కార్యాలయంలో ఏఈఓ రమణ రాజు,ఏఈఓ నటరాజు రావు దాతలను ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

# గోడ కూలి బాలుడికి గాయాలు

## బొమ్మలు తయారు చేసుకునేందుకు మట్టి తవ్వుతుండగా ఘటన



**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,27:**
గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో శనివారం ఓ బాలుడు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. బొమ్మలు తయారు చేసుకునేందుకు మట్టి సేకరించాలనే ఉద్దేశంతో పాత గోడ కింద బాలుడు మట్టి తవ్వుతున్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలిపోయింది.
గోడ శిథిలాలు బాలుడిపై పడటంతో రెండు కాళ్లు, చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. ఘటనను గమనించిన పొరుగున ఉన్న షంషీర్ వెంటనే స్పందించి బాలుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.పాతబడిన గోడల వద్ద పిల్లలు ఆడుకోవడం, మట్టి తవ్వడం వంటి పనులు చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

# జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో ఆంధ్రప్రదేశ్ జోరు!

**తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర జట్లపై విజయాలు.. సెమీఫైనల్‌కు ఏపీ పురుషుల జట్టు**




**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 27:**
శ్రీకాళహస్తి వేదికగా గత మూడు రోజులుగా ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న 72వ సీనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లలో తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర జట్లను ఓడించి ఏపీ జట్టు తమ సత్తా చాటింది.
ఈ జాతీయ స్థాయి పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన క్రీడాకారుడు క్రాంతి కుమార్ ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ విశేష ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రాంతి కుమార్ తన ఆటతీరుతో ఆకట్టుకున్నారు. కీలక సమయంలో చురుకైన ఆటను ప్రదర్శిస్తూ జట్టు విజయానికి తనవంతు సహకారం అందించారు.
స్థానికంగా క్రీడా ప్రతిభను చాటుకుంటున్న క్రాంతి కుమార్ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం పట్ల శ్రీకాళహస్తి క్రీడాభిమానులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెమీఫైనల్‌లోనూ ఇదే ఉత్సాహంతో రాణించి ఆంధ్రప్రదేశ్ జట్టును ఫైనల్‌కు చేర్చాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.
జాతీయ స్థాయిలో శ్రీకాళహస్తి క్రీడాకారుడి ప్రతిభ చాటడం పట్టణానికి గర్వకారణంగా నిలిచిందని పలువురు అభినందనలు తెలిపారు.

# తిరుపతి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ‘మన్ కీ బాత్’ కార్యక్రమం





**పాల్గొన్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు రామ్ మాధవ్.. రాష్ట్ర, జిల్లా నాయకుల హాజరు**

**తిరుపతి, పెన్ పవర్, సెప్టెంబర్ 27:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే ‘మన్ కీ బాత్ (మనసులో మాట)’ కార్యక్రమాన్ని తిరుపతి బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ రామ్ మాధవ్ పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.
ఈ సందర్భంగా దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంశాలపై ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగాన్ని నాయకులు ఆసక్తిగా విన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలతో ప్రధానమంత్రి నేరుగా అనుసంధానమవుతూ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు శ్రీ సామంచి శ్రీనివాస్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# చంద్రబాబు విజన్,లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నారాయణ అడుగులు





**పేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం.
మారుతున్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో రూ.13 కోట్ల సీఎస్ఆర్ నిధులతో హైస్కూల్‌కు శంకుస్థాపన**

**నెల్లూరు, సెప్టెంబరు 27 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన అభివృద్ధి విజన్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరు నగరంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను సమూలంగా మార్చే దిశగా మంత్రి పొంగూరు నారాయణ అడుగులు వేస్తున్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ హైస్కూళ్ల రూపురేఖలను మారుస్తున్నారు.ఇప్పటికే వీఆర్సీ, ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దిన మంత్రి నారాయణ,తాజాగా జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో మరో అంతర్జాతీయ ప్రమాణాల హైస్కూల్‌కు శ్రీకారం చుట్టారు.
ఆంటోనీ కనస్ట్రక్షన్స్ సంస్థ రూ.13 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పాఠశాలను నిర్మించేందుకు ముందుకొచ్చింది. పాఠశాల భవనాన్ని 56,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో 73 తరగతి గదులు,1,735 చదరపు అడుగుల విస్తీర్ణంలో డైనింగ్ హాల్ నిర్మించనున్నారు.ప్రిన్సిపాల్, సిబ్బంది, స్టోర్, కిచెన్ గదులు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా యాక్టివిటీ, మ్యూజిక్, డ్యాన్స్, లైబ్రరీ, వివిధ ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు కల్పించనున్నారు.మంత్రి నారాయణ తన కుమార్తె పొంగూరు షరణితో కలిసి పండుగ వాతావరణంలో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గొడ్డలి పార్టీ ప్రభుత్వం మూసివేసిన వీఆర్సీ పాఠశాలను కేవలం నాలుగు నెలల్లో ఆధునీకరించామని తెలిపారు. తన కుమార్తె షరణి, ఎన్సీసీ గ్రూప్ సహకారంతో తాను ఊహించనంత అద్భుతంగా వీఆర్సీని తీర్చిదిద్దామన్నారు. పేదల కష్టాలు తనకు తెలియవని భావించే వారు అవివేకులని వ్యాఖ్యానించారు. తాను గుడిసెలో పుట్టి, కడు పేదరికంలో పెరిగానని,కష్టపడి చదువుకుని ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు.
ఎన్నికల ప్రచార సమయంలో పేద పిల్లల పరిస్థితులను చూసి చలించిపోయానని, అప్పుడే వారికి విద్యను ఆస్తిగా అందించాలనే నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. స్నేహితులు, దాతల సహకారంతో ఆ లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నానన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నగరంలోని అన్ని హైస్కూళ్లను ఆధునిక సౌకర్యాలతో సిద్ధం చేస్తానని చెప్పారు.
దేశంలోని 90 శాతం రాష్ట్రాల్లో నారాయణ విద్యాసంస్థలు ఉన్నాయని, వాటి ద్వారా ఏడాదికి రూ.వెయ్యి కోట్ల టర్నోవర్ సాధించే అవకాశం ఉన్నప్పటికీ,పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజా సేవలో భాగంగా ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులను కూడా పేదల అభివృద్ధికి వెచ్చిస్తున్నానని తెలిపారు.పేదరికం కారణంగా తాను చెప్పులు కూడా లేకుండా ఎండలో నడిచి పాఠశాలకు వెళ్లేవాడినని మంత్రి నారాయణ తన బాల్యాన్ని గుర్తుచేశారు. ఆ బాధను నేటి పేద పిల్లలు అనుభవించకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకొస్తున్నానన్నారు. రూ.8 కోట్ల సొంత నిధులతో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు 10 వేల సైకిళ్లు పంపిణీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం నిలిపివేసిన అభివృద్ధి పనులన్నింటినీ తిరిగి ప్రారంభించామన్నారు.భగత్‌సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువకట్ట వాసులకు కలిపి 2,615 శాశ్వత పట్టాలు మంజూరు చేశామని, నగరంలో మరో 5 వేల కుటుంబాలకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేదలకు ఏ కష్టం వచ్చినా తన కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. ప్రజల సహకారంతో నెల్లూరును సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించి సింహపురి రూపురేఖలను మార్చడంతో పాటు దేశ పటంలో నెల్లూరు నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు.
మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న చులకన భావాన్ని మార్చాలన్నదే తన తండ్రి సంకల్పమన్నారు.నారాయణ విద్యాసంస్థల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. వీఆర్సీ, ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పారు. పేదరికం వల్ల తన తండ్రి ఎదుర్కొన్న ఇబ్బందులను మరెవరూ ఎదుర్కోకూడదన్న ఉద్దేశంతో కోట్లాది రూపాయల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. తండ్రి చేపట్టిన విద్యాయజ్ఞంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.
రూ.305 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
నగర పాలక సంస్థ పరిధిలోని హైస్కూళ్ల అభివృద్ధికి మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని డీఈఓ బాలాజీరావు తెలిపారు. ఇప్పటికే రూ.205 కోట్లతో పాఠశాలలను ఆధునీకరిస్తుండగా, మంత్రి ఆదేశాలతో మరో రూ.100 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. పేద పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆంటోనీ కనస్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధి నారాయణరావు,అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, వీఆర్సీ ప్రిన్సిపాల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరూ మెలగాలి

## ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

**177 నెలలుగా దాతల సేవాభావం అభినందనీయం: కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 27:**
సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నగర వీధిలో ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఆపన్నులకు అండగా నిలుస్తూ, వారి అవసరాలను గుర్తించి సహాయం చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా 177 నెలలుగా దాతలు ప్రతి నెలా నిర్దిష్టంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.
సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ మరింత మందికి అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.
కార్యక్రమంలో దాతలు, సేవా కార్యక్రమ నిర్వాహకులు, ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి మీద ధర్మాన సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి రాజధాని విషయంలో వైసీపీలో ఇప్పటికీ అదే గందరగోళం చెలరేగుతోందా అన్న చర్చ నడుతోంది. ఇప్పటికి అయిదు నెలల క్రితం భారత పార్లమెంట్ లో అమరావతి రాజధానికి సంబంధించిన బిల్లుని ప్రవేశపెట్టారు. ఏపీకి ఏకైక రాజధాని అమరావతి మాత్రమే అని అక్కడ ఆమోదించి చట్టబద్ధత కల్పించారు. అయితే వైసీపీ మాత్రం అమరావతి విషయంలో ఇంకా తన ఆలోచనలు వేరే విధంగా ఉన్నాయని చెబుతోంది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావు ఒక టీవీ డిబేట్ లో అమరావతి మీద సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అమరావతిని వ్యతిరేకించడం లేదు అంటూనే ఆయన కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.

**కేంద్రీకృత విధానాలు :**

అమరావతి రాజధాని పేరుతో కేంద్రీకృత విధానాలకు మాత్రమే తమ పార్టీ వ్యతిరేకిస్తుందని ధర్మాన స్పష్టం చేశారు. ఒక పౌరుడిగా వైసీపీ నాయకుడిగా తాను ఎప్పటికీ ఇదే మాటకు కట్టుబడి ఉంటాను అని ఆయన పేర్కొన్నారు. మొత్తం మూడు బడ్జెట్ లను ఇప్పటికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెడితే ఆ సొమ్ము అంతా అమరావతికే పెట్టారని ఆయన ఆక్షేపించారు. అలాగే కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూచీ కత్తుతో యాభై వేల కోట్ల రూపాయలను తెచ్చి ఖర్చు చేస్తున్నారు అని అన్నారు. ఇవన్నీ ప్రజలు తీర్చాల్సినవే అని ఆయన చెప్పారు. ప్రజలు కట్టే పన్నులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా సంపద పంచాల్సిన అవసరం ఉందని ధర్మాన అన్నారు. రాజ్యాంగం ఇదే చెబుతోంది అని అన్నారు. అందుకే తమ పార్టీ ఈ కేంద్రీకృత విధానాలను పూర్తిగా వ్యతిరేకిస్తోంది అని ఆయన చెప్పారు.

**గొంతు కోస్తున్నారు :**

ఉత్తరాంధ్రాతో పాటు రాయలసీమ ప్రజల గొంతు కోస్తున్నారు అని ధర్మాన మండిపడ్డారు. ఎనభై ఏళ్లు గడచినా అనేక ఉత్తరాంధ్రా జిల్లాల నీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన ఏపీకి 23 కేంద్ర సంస్థలను ఇస్తే అందులో ఒక్కటి కూడా శ్రీకాకుళానికి ఎందుకు పెట్టలేదని ఆయన నిలదీశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అయిదేళ్ల పాలనలో తాము చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మూలపేటలో నాలుగు వేల కోట్లతో పోర్టుల నిర్మాణం అన్నది వైసీపీ హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. ఉద్ధానంలో ప్రజలకు వేయి కోట్లు పెట్టి రక్షిత మంచి నీరు పథకం ద్వారా అందించామని చెప్పారు. అలాగే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ తో పాటు గిరిజన ప్రాంతాలలో వర్శిటీతో పాటు ప్రతీ జిల్లాకు మెడికల్ కాలేజిని తీసుకుని వచ్చామని ధర్మాన వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్టు కూడా వైసీపీ హయాంలోనే జరిగింది అని ధర్మాన చెప్పారు. చంద్రబాబు గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రిగా ఉన్నా ఉత్తరాంధ్రాకు ఏమి చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**మావిగన్ మీద :**

ఇక మావిగన్ విషయంలో కూడా వైసీపీ అధినేత అన్నది వేరు అని ధర్మాన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మొత్తం సంపదను కేవలం కొందరికే పెట్టకుండా మరిన్ని జిల్లాలకు విస్తరించాలని జగన్ ప్రభుత్వానికి సూచించారు అని ఆయన అన్నారు. అంతే తప్ప వైసీపీ కేంద్రీకృత విధానాలకు కట్టుబడి ఉన్నట్లు కానే కాదని ఆయన అన్నారు. ఈ విషయంలో తమ పార్టీ పూర్తిగా అవగాహనతోనే ఉందని ధర్మాన చెప్పడం విశేషం.

**తెలంగాణా ఉద్యమం :**

సంపద అంతా ఒకే చోట పోగేయడం వల్లనే తెలంగాణా ఉద్యమం వచ్చింది అని ధర్మాన వివరించారు. ఈ ఉద్యమం 1969లో తొలిసారి వచ్చినా సక్సెస్ కాలేదని 2000 సంవత్సరంలో మాత్రం రాజకీయాలకు పార్టీలకు అతీతంగా మొత్తం ప్రజలు పాల్గొనడం వల్లనే విజయవంతం అయింది అన్నారు. తమ ప్రాంతానికే సంపద అంతా ఉండాలన్న మానవ సహజమైన స్వార్థం కూడా ఉద్యమానికి కారణం అన్నారు. రేపటి రోజున ఇదే తీరున అమరావతిలో కూడా ఉద్యమం రాదని గ్యారంటీ ఏముందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు గత అనుభవాలను పక్కన పెట్టి మరీ అమరావతి పేరుతో కేంద్రఈకృత విధానాలను అమలు చేస్తున్నారు అని అన్నారు. రాజధానికి మౌలిక సదుపాయాలు ఉండాలి అని అదే సమయంలో అన్ని ప్రాంతాలకు న్యాయం జరగాలని ఆయన అన్నారు. తాను వేర్పాటు వాద వ్యాఖ్యలు చేయడం లేదని ఆయన సమర్థించుకుంటూనే చంద్రబాబు చర్యల వల్లనే రేపటి రోజున ఆ పరిస్థితి వస్తుందేమో అన్నదే ఆందోళన అని చెప్పుకొచ్చారు.

# ఆపరేషన్ వైసీపీ.. గట్టిగా కెలకుతున్న చిన్నశ్రీను

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నుంచి టీడీపీలో చేరిన విజయనగరం జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను ఆపరేషన్ వైసీపీ స్టార్ట్ చేశారు. రెండు వారాల కిందట టీడీపీ తీర్థం పుచ్చుకున్న చిన్న శ్రీను ఇప్పుడు వైసీపీలో ఉన్న తన అనుచరులను టీడీపీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు వేగవంతం చేశారని చెబుతున్నారు. ఆదివారం మాజీ మంత్రి, తన మేనమామ బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో భారీ చేరికల కార్యక్రమం చేపట్టిన చిన్నశ్రీను గట్టి సవాల్ విసిరారని అంటున్నారు. పార్టీలో చేరిన కొత్తలో వైసీపీ నేతలు ఎవరితోనూ మాట్లాడని చిన్నశ్రీను అంతరంగం ఎవరికీ అర్థం కాలేదని, కానీ ఇప్పుడు వరుసగా చేరికలను ప్రోత్సహించేలా ఆయన కదలికలు ఉన్నాయని చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీలో సొంత బలం పెంచుకోవడంతోపాటు వచ్చే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచే విధంగా పార్టీకి ఉపయోగపడాలని జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ఇందులో భాగంగా తొలి విడతలో తన అనుచరులైన ఆరుగురు జడ్పీటీసీ సభ్యులను టీడీపీలోకి తెచ్చేందుకు చిన్నశ్రీను ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. ఈ ఆరుగురు ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేశారని, త్వరలో మరికొంత మంది కూడా రాజీనామాలు చేయడం ద్వారా భారీ ఎత్తున ఒకేసారి చేరికల సభ నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో మండలాల వారిగా సంప్రదింపులు జరుపుతున్నారని, అంతా ఒక కొలిక్కి వచ్చిన తర్వాత జిల్లాస్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నారని అంటున్నారు.

**సీఎంను రప్పిస్తారా?**

ఇక జిల్లాలో పెద్ద ఎత్తున చేరికల సభ నిర్వహించాలని భావిస్తున్న చిన్న శ్రీను ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించాలని అనుకుంటున్నారని సమాచారం. అయితే సీఎం చంద్రబాబు వరుస కార్యక్రమాలు ఉండటంతో ఆయన వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. దీంతో యువనేత లోకేశ్ ఆధ్వర్యంలో చేరికల సభ నిర్వహించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి



జిల్లాలో దాదాపు 20 మండలాల నుంచి నాయకులు ఒకేసారి పసుపు కండువాలు కప్పుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారని అంటున్నారు. దీనివల్ల తనను పార్టీలో చేర్చుకోవడం వల్ల కలిగే లాభమేంటి అన్నది టీడీపీ పెద్దలకు తెలియాలనేది చిన్నశ్రీను ప్లాన్ గా ఉందని చెబుతున్నారు.

**వైసీపీకి గట్టి దెబ్బ తప్పదా?**

ఇక చిన్నశ్రీను కదలికలు వైసీపీలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి, తన మేనమామ బొత్స ఇలాకాను పునాదులతో సహ కదిలించేలా చిన్నశ్రీను ప్లాన్ చేస్తున్నారని జరుగుతున్న ప్రచారం ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుతం మెరకముడిదాం మండలంలో దాదాపు అన్ని పంచాయతీల నుంచి వైసీపీ నేతలను టీడీపీలోకి తీసుకురావాలని చిన్నశ్రీను వ్యూహరచన చేసినట్లు చెబుతున్నారు. బొత్సకు ఈ మండలంలో గట్టి పట్టు ఉండగా, చిన్నశ్రీను అక్కడే తన దృష్టి కేంద్రీకరించడంపై ఆసక్తి రేగుతోంది.గతంలో మెరకముడిదాం మండలం నుంచి జడ్పీటీసీగా చిన్న శ్రీను ఏకగ్రీవంగా ఎన్నిక అవడం కూడా ఆయనకు లాభిస్తోందని చెబుతున్నారు. మరోవైపు నియోజకవర్గంలోని మరో మూడు మండలాల్లో కూడా గుర్తింపు ఉన్న స్థానిక నేతలు చిన్నశ్రీనుతో టచ్ లో ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు చిన్నశ్రీను వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నట్లు జరుగుతున్న ప్రచారం వైసీపీలో అంతర్గతంగా వాడివేడి చర్చకు దారితీస్తోంది. చిన్న శ్రీను పార్టీ మారిన కొత్తలో కేడర్ ఆయనతో వెళ్లకుండా వరుసగా సమావేశాలు నిర్వహించిన వైసీపీ నేతలు ఆ తర్వాత పట్టు విడిచినట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో చిన్న శ్రీను వ్యూహాలకు పదును పెడుతున్నారని అంటున్నారు. మొత్తానికి వైసీపీని ఖాళీ చేయించాలనే లక్ష్యంతో చిన్న శ్రీను వేస్తున్న రాజకీయ ఎత్తుగడ జిల్లా రాజకీయాలను ఆసక్తికరంగా మార్చేసిందని అంటున్నారు.

# సన్ ఆఫ్ బొత్స...సొంత ఇలాకాలో మెరిసేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్ర నేతగా ఎదిగిన క్రమంలో ఆయన తరపున జిల్లా రాజకీయాలను మొత్తం చూసి నమ్మిన బంటుగా ఉన్న వారు చిన్న శ్రీను. దగ్గర బంధుత్వం ఉన్నా కూడా దానికి మించి గురు శిష్య బంధమే ఈ ఇద్దరినీ నడిపించింది అని చెబుతారు. బొత్స వ్యూహాలు ఆయన చాతుర్యం, పట్టూ అన్నీ కూడా అచ్చంగా అభ్యసించి అందుకున్న వారుగా చిన్న శ్రీనుని చెబుతారు. బొత్స ఆలోచనలను అమలులో నూరు శాతం పక్కాగా నెరవేర్చిన క్రెడిట్ కూడా ఆయనదే అని అంటారు. అలాంటి చిన్న శ్రీను వైసీపీని వీడి టీడీపీలోకి చేరడం బొత్సకు నిజంగా భారీ షాక్ అని చెప్పాలి. చిన్న శ్రీను ఉన్నారన్న నిబ్బరంతో ఆయన అంతే స్థాయి నేతను మరొకరిని తయారు చేసుకోలేకపోయారు. దాంతో ఇపుడు ఆయన రాజకీయానికి అదే పెద్ద లోటుగా మారుతోంది అంటున్నారు.

**చీపురుపల్లిలోనూ :**

బొత్స కుటుంబానికి సొంత ఇలాకా చీపురుపల్లి నియోజకవర్గం. ఇక్కడ ఆయన అయిదు సార్లు పోటీ చేస్తే మూడు సార్లు గెలిచారు. గెలిచిన ప్రతీ సారీ మంత్రిగా ఉన్నారు. ఆయనకు అంతగా ఆదరించిన ఈ నియోజకవర్గం అంతటా బొత్స బంధువులు, సన్నిహితులు అతి పెద్ద అనుచరణ గణం కనిపిస్తారు. విభజన తరువాత బొత్స 2014లో
కాంగ్రెస్ తరపున పోటీ చేసి కూడా 40 వేల పై చిలుకు ఓట్లు సాధించారు అంటే అది ఆయన వ్యక్తిగత బలం అని కూడా చెబుతారు. అయితే ఇదే నియోజకవర్గం మొత్తం మీద పట్టు చిన్న శ్రీనుకు ఉంది. ఆయన బొత్స పరోక్షంలో పూర్తిగా చక్రం తిప్పేవారు. అలా బొత్స కంటే కూడా అందరితో సాన్నిహిత్యం ఆయనకే సొంతం. ఇపుడు ఆ గొలుసు బంధం తెగిపోయింది. గ్యాప్ అయితే పెరిగిపోయింది. అదే బొత్స వర్గీయులలో చింతగా మారింది.

**బొత్స తరపున ఆయన :**

ఈ నేపధ్యంలో బొత్స తరపున ఆయన కుమారుడు డాక్టర్ సందీప్ చీపురుపల్లిలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. ఒక విధంగా ఆయనకు అనధికారికంగా ఈ నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు అని అంటున్నారు. నిజానికి 2029 ఎన్నికల్లో సందీప్ పోటీ చేస్తారు అన్నది చాలా కాలంగా ఉన్న ప్రచారం. ఎపుడైతే చిన్న శ్రీను వైసీపీని వీడి టీడీపీలో చేరారో బొత్స కూడా తన వ్యూహం మార్చారు. కుమారుడికి బదులుగా తానే బరిలోకి దిగుతాను అని స్పష్టం చేశారు. తాను ఉంటే కనుక రేపటి రోజున చిన్న శ్రీను పోటీ చేసినా తన వైపే మొత్తం అనుచరులు బంధు గణం నిలుస్తారు అన్నది కూడా ఆయన వ్యూహంగా ఉంది అని అంటున్నారు. ఇక బొత్స మరో మాట చెప్పారు, తాను ప్రజలతో పార్టీ జనాలతో మరింతగా సాన్నిహిత్యం నెరుపుతాను అని. అందుకే ఆయన తన కుమారుడు సందీప్ కే బాధ్యతలు అప్పగించారని అంటున్నారు.

**రాణించగలరా :**

ఇప్పటిదాకా ఈ బాధ్యతలను చిన్న శ్రీను చూశారు. ఇటీవలనే బొత్స కుమార్తె అనూష కూడా చీపురుపల్లి నియోజకవర్గంలో పట్టు సాధించే ప్రయత్నం చేస్తూండగానే ఆమెని భీమిలీ వైసీపీ ఇంచార్జిగా చేశారు. దాంతో ఇపుడు డాక్టర్ సందీప్ మొత్తం పార్టీ కార్యక్రమాలను చూడాల్సి ఉంటుందని అంటున్నారు. ఒక వైపు తండ్రి అండ ఉన్నా సలహా సూచనలు ఆయనవి అయినా కూడా రాజకీయాలు చేయడం
అంత ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. పైగా అవతల వైపు చిన్న శ్రీను వ్యూహాలు ఎటూ పదును తేరి ఉంటాయని అంటున్నారు. ఏది ఏమైనా ఈ యువ నేతకు మొదట్లోనే కఠిన పరీక్ష సొంత ఇలాకాలోనే ఎదురవుతోంది అని అంటున్నారు. 2029 లో బొత్స పోటీకి తగిన సంపూర్ణమైన సానుకూల వాతావరణం ఉండేలా చూడాల్సిన బృహత్తర బాధ్యత అయితే సందీప్ మీద ఉందని అంటున్నారు.

# తొలి అడుగులోనే అగ్నిపరీక్ష.. బొత్స కూతురు పాస్ అవుతారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయ వారసుల ఎంట్రీ ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అందునా ఉద్దండ నేతల ఇళ్ల నుంచి వచ్చే కొత్త గళాలపై అందరి ఫోకస్ మరింత ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ సరిగ్గా అలాంటి ఆసక్తే నెలకొంది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన వేళ.. ఆమెకు తొలి అడుగులోనే భారీ అగ్నిపరీక్ష ఎదురుకాబోతోంది.ఇటీవల జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ, మండలాల మార్పుల నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా పరిషత్ స్వరూపం పూర్తిగా మారిపోయింది. కొత్తగా ఏర్పాటైన పరిమిత మండలాల జెడ్పీలో ఎక్కువ భాగం భీమిలి నియోజకవర్గం పరిధిలోనే ఉండటం గమనార్హం. భీమిలి, ఆనందపురం, పద్మనాభం వంటి కీలక మండలాలతో పాటు పెందుర్తి పరిధి కూడా జెడ్పీ పరిధిలోకి రావడంతో.. ఇక్కడ రాజకీయ వ్యూహాలు తలకిందులవుతున్నాయి. బలం ఎక్కడుందో అక్కడే రాజకీయం నడవాల్సి ఉండటంతో, ప్రత్యక్ష యుద్ధానికి అధికార, విపక్షాలు రెడీ అవుతున్నాయి.

**కూటమి వ్యూహాలను ఎదుర్కోవడం సులువేనా?**

భీమిలి ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ కూటమికి క్షేత్రస్థాయిలో గట్టి పట్టుంది. ఈ నేపథ్యంలో కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను మాత్రమే కాకుండా, మూడు జెడ్పీటీసీ స్థానాలు, సుమారు యాభైకి పైగా ఎంపీటీసీ స్థానాలను గెలుచుకోవాల్సిన బాధ్యత అనూషపై ఉంది. జీవీఎంసీలో విలీనం కాగా మిగిలిన ఐదు డివిజన్లలోనూ సత్తా చాటాల్సిన పరిస్థితి. విశాఖ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి భీమిలి నుంచే బలమైన రాజకీయ పునాది అవసరం. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అంత సులువుగా లేవని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఇక్కడ అనుభవం ఉన్న సీనియర్ నేతలే కూటమి ఉధృతిని తట్టుకోలేక వెనకడుగు వేసిన దాఖలాలున్నాయి.అయితే రాజకీయాల్లో చాణక్యుడిగా పేరున్న బొత్స సత్యనారాయణ తన అనుభవంతో కూతురికి దిశానిర్దేశం చేయగలరు. కానీ ఆయన ఏకకాలంలో తన సొంత ప్రాంతమైన విజయనగరం జిల్లా రాజకీయాలను కూడా బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది. ఎటుచూసినా సవాళ్లతో కూడుకున్న ఈ రాజకీయ రణరంగంలో బొత్స అనూష తన తొలి ప్రయత్నంలోనే ఏ మేర రాణిస్తారు? అనుభవజ్ఞులైన ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొని పార్టీకి విజయాన్ని అందిస్తారా? లేదా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# బీజేపీ టికెట్‌తో పోటీ చేయి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై మరో సంచలన ఆరోపణ..



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై.. ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో పాటు ఎన్నికల నిర్వహణపై ప్రతిపక్షాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ తీవ్ర వివాదం ముసురుకుంది. ఆయన సివిల్ సర్వీస్‌లో ఉన్న సమయంలోనే ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని.. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సిందిగా తనను కోరారని కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ జిజి థామ్సన్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలాన్ని రేపుతున్నాయి.జిజి థామ్సన్ వెల్లడించిన కథనం ప్రకారం.. ఈ కీలక సంభాషణ 2016లో ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఒక విమానంలో జరిగింది. అప్పట్లో జ్ఞానేశ్ కుమార్ తో పాటు తాను కూడా ప్రభుత్వ సర్వీసులోనే ఉన్నామని ఆయన తెలిపారు. సంభాషణ సందర్భంగా పదవీ విరమణ తర్వాత తన భవిష్యత్ ప్రణాళికల గురించి జ్ఞానేశ్ కుమార్ అడిగి తెలుసుకున్నారని.. రాజకీయాల్లోకి రావడం మంచిదని సూచించారని చెప్పారు. ముఖ్యంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని పథనంతిట్ట నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బరిలోకి దిగాలని ప్రతిపాదించారని థామ్సన్ ఆరోపించారు. అక్కడ పోటీ చేసి గెలిస్తే ఎంపీగా మాత్రమే కాకుండా.. కేంద్ర మంత్రిగా కూడా ఎదిగే అవకాశాలు ఉంటాయని తనకు ఆశ చూపినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే తనకు రాజకీయాల్లోకి రావడానికి ఎలాంటి ఆసక్తి లేకపోవడంతో ఆ ప్రతిపాదనను అక్కడికక్కడే తిరస్కరించినట్లు తెలిపారు.

ఈ ఆరోపణలు వెలుగులోకి రావడంతో కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక సివిల్ సర్వెంట్‌గా ఉంటూ అధికార పార్టీకి రాజకీయం చేసిన వ్యక్తిని ఇప్పుడు ఎన్నికల నిష్పక్షపాత 'అంపైర్'గా కూర్చోబెట్టారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇది దేశంలో ప్రజాస్వామ్యాన్ని.. ఎన్నికల ప్రక్రియను భ్రష్టు పట్టించే ప్రత్యక్ష 'మ్యాచ్ ఫిక్సింగ్' అని ఆయన విమర్శించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా స్పందిస్తూ ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదనే అనుమానాలు బలపడుతున్నాయని.. ప్రజల అభిప్రాయానికి, వెలువడుతున్న ఫలితాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోందని ఆరోపించారు.

ఇప్పటికే ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలు, నిర్ణయాలపై ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన కథనాలు విపక్షాలకు ఆయుధంగా మారాయి. గతంలోనే 73 మంది రాజ్యసభ సభ్యులు ఆయనపై 'సాక్ష్యాధారాలతో కూడిన దుష్ప్రవర్తన' కింద తొలగింపు నోటీసు ఇవ్వగా.. ఇప్పుడు ఈ తాజా పరిణామాల నేపథ్యంలో ఆయనను పదవి నుంచి తొలగించేందుకు వీలుగా పార్లమెంటులో ఉమ్మడి ప్రతిపక్షాల తరఫున ఇంపీచ్‌మెంట్ నోటీసును సిద్ధం చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలుపుతున్నాయి.

మరోవైపు అంతర్గత చర్చల్లో అభిప్రాయ భేదాలు నమోదు కావడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమేనని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. థామ్సన్ చేసిన ఆరోపణలు ఇప్పటివరకు కేవలం వ్యక్తిగత వాదనలుగానే ఉన్నాయని.. దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక లేదా స్వతంత్ర ఆధారాలు బయటకు రాలేదని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. ఒక రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై సివిల్ సర్వీస్ కాలం నాటి రాజకీయ బంధాల ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.

# విరాట్, గిల్ సెంచరీలు.. విండీస్‌పై భారత్ ఘన విజయం



వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమ్ఇండియా అదరగొట్టింది. తిరువనంతపురం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ 101 పరుగులతో సెంచరీ సాధించగా.. జాన్ కాంప్‌బెల్ 62, అమిర్ జంగో 58 పరుగులతో రాణించారు. భారత్ బౌలర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. 296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ మంచి ఆరంభం అందించారు. రోహిత్ 32 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ.. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. గిల్, విరాట్ కలిసి విండీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. గిల్ 108 బంతుల్లో 110 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. విరాట్ కోహ్లీ మరింత దూకుడుగా ఆడి 88 బంతుల్లో 139 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్‌లో మరో అరుదైన ఘనతను కూడా సాధించాడు. వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ మైలురాయిని అందుకున్న ఆటగాడిగా రికార్డులోకి ఎక్కాడు. భారత్ కేవలం 41.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 300 పరుగులు సాధించింది. విరాట్‌తో పాటు రుతురాజ్ గైక్వాడ్ 13 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గిల్, విరాట్ సెంచరీలతో భారత్ అలవోకగా విజయాన్ని అందుకుంది.

# నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో క్వార్టర్ ఫైనల్.. భారత్ మ్యాచ్‌కు భారీ వర్షం ముప్పు!




**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్ లోని నిస్షిన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026 2026)లో గోల్డ్ మెడల్ ను నిలబెట్టుకోవడానికి బరిలోకి దిగుతున్న భారత క్రికెట్ జట్టు కు తొలి మ్యాచ్ కి ముందే వర్షం రూపంలో పెద్ద గండం ఎదురైంది. సోమవారం (సోమవారం, సెప్టెంబర్ 28) కొరోగి స్పోర్ట్స్ పార్క్ లో ఆఫ్ఘనిస్తాన్ తో జరగనున్న కీలకమైన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌పై వర్షం ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

**మ్యాచ్ కి వర్షం అడ్డంకి:**

ఉదయం 10 గంటలకి (జపాన్ లోకల్ సమయం, మధ్యాహ్నం 14:00 గంటలకు) ప్రారంభం కావాల్సిన ఈ మ్యాచ్‌కు వాతావరణం సహకరించేలా కనిపించడం లేదు. ప్రముఖ వాతావరణ సంస్థ ఆక్యూవెదర్ నివేదిక ప్రకారం, మ్యాచ్ ప్రారంభ సమయంలో వర్షం కురిసే అవకాశం ఏకంగా 70 శాతంగా ఉంది. అంతేకాకుండా మేఘావృతం 97 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. ఇక సాయంత్రం సమయంలో పరిస్థితి మరింత దిగజారి, వర్షపాతం 100 శాతానికి, మేఘావృతం 99 శాతానికి చేరుకునే ప్రమాదం ఉంది.

**మ్యాచ్ రద్దయితే ఏంటి పరిస్థితి:**

ఒకవేళ వరుణుడి ప్రభావంతో మ్యాచ్ పూర్తిగా రద్దయితే, టోర్నమెంట్ నిబంధనల ప్రకారం మెన్ ఇన్ బ్లూ జట్టుకే పూర్తి లాభం చేకూరనుంది. హయ్యర్ సీడింగ్ కారణంగా భారత జట్టు నేరుగా సెమీఫైనల్స్ లోకి దూసుకెళ్తుంది. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు జరిగిన 13 టీ20 మ్యాచ్‌లలో భారత్ 12 సార్లు విజయం సాధించగా, ఒకటి రద్దయింది. ఇటీవల జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను కూడా భారత్ 3--0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

**పరిస్థితులు ఏవైనా సరే, మేము సిద్ధంగా ఉన్నాం: శ్రేయస్**

వాతావరణం ఎలా ఉన్నప్పటికీ, తాము ఒక ప్రొఫెషనల్స్ బృందం, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమయ్యామని భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశారు. మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ.. అవును, వర్షం పడే అవకాశం ఉంది.. అయితే దానిని మేము ఒక కారణంగా చూపలేం, ఇలాంటి అడ్డంకులు వస్తూనే ఉంటాయి. పరిస్థితి ఏదైనా సరే మేము మానసికంగా సిద్ధంగా ఉన్నాం, రేపటి మ్యాచ్‌లో వీలైనంత త్వరగా పరిస్థితులకు అలవాటు పడతామని పేర్కొన్నాడు.

# ఆసియా గేమ్స్?లో భారత్ సత్తా.. స్క్వాష్‌లో అనాహత్, అభయ్ సింగ్‌లకు సిల్వర్ మెడల్స్!






**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్ వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో భారత స్క్వాష్ క్రీడాకారులు అద్భుత పోరాటపటిమ కనబరిచారు. పతకాల పట్టికలో ఇండియా తరఫున స్వర్ణాలు సాధించాలన్న వారి కల చివరి మెట్టుపై చేదిరిపోయింది. మహిళల, పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో బరిలోకి దిగిన యువ సంచలనం అహనాత్ సింగ్, సీనియర్ ప్లేయర్ అభయ్ సింగ్ హోరాహోరీగా పోరాడినప్పటికీ రజత పతకాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**స్వర్ణం కోల్పోయిన అహనాత్ సింగ్:**

మహిళల స్క్వాష్ సింగిల్స్ ఫైనల్‌లో భారత్ తరఫున బరిలోకి దిగిన యువ క్రీడాకారిణి అహనాత్ సింగ్ మలేషియాకు చెందిన స్టార్ ప్లేయర్ శివసంగరి సుబ్రమణియంతో తలపడింది. కేవలం 27 నిమిషాల పాటు కొనసాగిన ఈ పోరులో అహనాత్ 0--3 తేడాతో ఓడిపోయింది. తొలి రెండు గేమ్‌లను 4--11, 4--11 తో కోల్పోయిన అహనాత్.. మూడో గేమ్‌లో కొంత పోటీనిచ్చినప్పటికీ 7--11 తేడాతో వెనుకంజ వేసి సిల్వర్ తోనే సరిపెట్టుకుంది.

**చరిత్ర సృష్టించిన అభయ్ సింగ్:**

పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో భారత నంబర్ వన్ అథ్లెట్ అభయ్ సింగ్ మలేషియాకు చెందిన ప్రపంచ 17వ ర్యాంక్ ప్లేయర్ ఎయిన్ యో చేతిలో 9-11, 5-11, 5-11 తేడాతో పోరాడి ఓడిపోయాడు. ఈ ఓటమితో అభయ్ సిల్వర్ పతకం సాధించినప్పటికీ, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించే సువర్ణావకాశాన్ని తృటిలో కోల్పోయాడు (స్వర్ణం గెలిచిన వారికి ఒలింపిక్స్ బెర్త్ లభిస్తుంది). కానీ, దిగ్గజ క్రీడాకారుడు సౌరవ్ ఘోషల్ తర్వాత ఆసియా క్రీడల సింగిల్స్ ఫైనల్ చేరిన రెండో భారత మెన్స్ ప్లేయర్ గా అభయ్ సింగ్ రికార్డు సృష్టించాడు. అర్జున అవార్డు గ్రహీత అయిన అభయ్.. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ పతకాన్ని సాధించడం విశేషం.

**32కి చేరిన భారత్ పతకాల సంఖ్య:**

ఈ రెండు రజత పతకాలతో భారత్ పతకాల పట్టిక మరింత బలపడింది. ప్రస్తుత ఆసియా క్రీడలలో భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 32కి చేరింది. ఇందులో 4 స్వర్ణాలు, 14 రజతాలు, 14 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాల వేటలో టీమిండియా అథ్లెట్లు అలుపెరుగని పోరాటం కొనసాగిస్తున్నారు.

# దిగ్గజాల వల్ల కాలేదు.. రావిపూడితో అవుతుందా?








సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున కలిసి సినిమా చేస్తే ఎలా ఉంటుంది.. ఆ ఆలోచన టాలీవుడ్ లో కొత్తదేమీ కాదు. కొన్నేళ్లుగా ఆ ఇద్దరు స్టార్ హీరోల కాంబోపై చర్చ జరుగుతూనే ఉంది. గతంలో ఏకంగా ఇద్దరు సీనియర్ డైరెక్టర్లు ట్రై చేసినా ఆ కాంబినేషన్ పట్టాలెక్కలేదు. ఇప్పుడు కొంతకాలంగా జరుగుతున్న మల్టీస్టారర్ ప్రచారానికి సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి పేరు యాడ్ కావడంతో మరోసారి ఇంట్రెస్ట్ మొదలైంది. నిజానికి చిరంజీవి, నాగార్జున ఇద్దరూ కొన్నేళ్లుగా టాలీవుడ్ లో టాప్ హీరోలుగా కొనసాగుతున్నారు. పర్సనల్ గా కూడా మంచి ఫ్రెండ్స్. ఒకరి సినిమాలను మరొకరు అభినందించుకోవడం, ఫ్యామిలీ ఈవెంట్స్ లో కలుసుకోవడం చూస్తూనే ఉంటాం. కానీ స్క్రీన్ పై మాత్రం ఇద్దరూ కలిసి కనిపించలేదు. ఆ కోరిక ఎప్పటికైనా తీరుతుందా అని అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

యితే ఆ కాంబో కోసం మొదటి ప్రయత్నం దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ టైమ్ లో జరిగింది. చిరంజీవితో అల్లుడా మజాకా, నాగార్జునతో హలో బ్రదర్ వంటి సినిమాలు చేసిన ఈవీవీ.. ఇద్దరినీ కలిపి మల్టీస్టారర్ చేయాలనే ఆలోచన చేశారు. అప్పట్లో ఆ ప్రాజెక్టుపై చర్చలు జరిగినా సినిమా మాత్రం ముందుకు వెళ్లలేదు. ఆ తర్వాత మరోసారి ఆ కాంబినేషన్ కు ట్రై చేశారు దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు. ఈసారి విషయం కాస్త ముందుకెళ్లింది. స్టోరీ రెడీ అయింది. చిరంజీవి, నాగార్జున ఇద్దరూ నటించేందుకు ఓకే చెప్పారు. షూటింగ్ మొదలై కొన్ని కీలక సీన్స్ ను షూట్ చేసినట్లు సమాచారం. అయితే కథ చిరు రోల్ కు పూర్తిగా సరిపోదనే అభిప్రాయంతో రాఘవేంద్రరావే ఆ ప్రాజెక్టును ఆపేశారు. దీంతో మరోసారి చిరు- నాగ్ మల్టీస్టారర్ కలగానే మిగిలింది. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత అదే కాంబోపై మళ్లీ ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా చిరంజీవి, నాగార్జునతో రావిపూడి మల్టీస్టారర్ చేయబోతున్నారని సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతున్నాయి. అయితే రావిపూడికి సీనియర్ హీరోలతో పనిచేసిన ఎక్స్పీరియన్స్ ఉంది. వెంకటేష్ తో ఎఫ్2, ఎఫ్3, సంక్రాంతికి వస్తున్నాం వంటి సినిమాలు చేశారు. బాలకృష్ణతో భగవంత్ కేసరి మూవీ తెరకెక్కించారు. ఇటీవల చిరంజీవితో మన శంకర వరప్రసాద్ గారు మూవీ చేశారు. అందుకే నాగార్జునతో సినిమా చేయాలనే కోరిక తనకు ఉందని అనిల్ గతంలోనే చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు నాగార్జునతో అనిల్ రావిపూడి చేయబోయే ప్రాజెక్టులో చిరంజీవిని కూడా భాగం చేయాలనే ఆలోచన ఆయనకు ఉందట. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో ఆ మల్టీస్టారర్ తెరకెక్కుతుందని, 2028 సంక్రాంతి రిలీజ్ ను టార్గెట్ చేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. అయితే ఇప్పటివరకు దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. కాబట్టి ఇది ప్రస్తుతానికి రూమర్ మాత్రమే. కానీ గతంలో ఈవీవీ, రాఘవేంద్రరావు వంటి దిగ్గజ దర్శకులు ప్రయత్నించి పూర్తి చేయలేకపోయిన చిరు- నాగ్ కాంబినేషన్.. ఇప్పుడు అనిల్ రావిపూడి చేతుల్లోకి వస్తుందనే వార్త మాత్రం అభిమానుల్లో ఇంట్రెస్ట్ పెంచుతోంది. నిజంగా ఈసారి ఆ కాంబో పాజిబుల్ అవుతుందా అనేది అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965